ప్రజాశక్తి

గురువారం జనవరి 1 2026 పేజీలు 12



విజయనగరం

పార్వతీపురం మన్యం

కొంగొత్త ఆశలు.. ఆశయాలతో..

చరిత్ర పుటల్లోకి 2025 సంవత్సరం

న్యూ ఇయర్ వేడుకల్లో ప్రజానీకం

నవ వసంతంలోకి

గిర్రున తిరిగే కాల చక్రంలో మరో ఏడాది (2025) కలసిపోయింది. జ్ఞాపకాలను చరిత్ర పుటల్లో నిక్షిప్తం చేసింది. గత ఏడాది తీపి, చేదు జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ వీడ్కోలు పలికింది. కొత్త ఆశలను చిగురింపజేస్తూ నూతన సంవత్సరం (2026)లోకి అడుగుపెట్టింది. ఎన్నో ఆశలు.. ఆశయాలతో జిల్లా ప్రజలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్లు, కార్యాలయాల ఎదుట రంగుల హరివిల్లులు, వెల్‌కమ్ ముగ్గులు దర్శనమిచ్చాయి. గతేడాది కష్టసుఖాలను గుర్తు చేసుకుంటూ కొత్త సంవత్సరంలోకి కొంగొత్త ఆశలతో అడుగిడుతున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రజాశక్తి - విజయనగరం డెస్క్

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జనం ఒకింత ఉత్సాహంతో కేరింతల నడుమ కేకులు కట్ చేస్తున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఈ ఏడాదంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పరస్పర పలకరింపులు, వాట్సాప్ మెసేజ్‌లు బుధవారం అర్ధరాత్రి నుంచే మొదలయ్యాయి. ఇదంతా షరా మామూలే. నూతన సంవత్సర వేడుకలు ఎప్పుడూ జరుగుతున్నవే. కానీ, నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ కొత్త ఆశలు మొలకెత్తాయి. అందుకు తగ్గట్టే ప్రణాళికలు రూపొందించు కుంటున్నారు. ఈ ఏడాది వ్యాపారంలో విస్తరించాలని, వృద్ధిచెందాలని కొందరు.. ఉపాధి, ఉద్యోగాలు సాధించాలని మరికొందరు.. తమ కష్టనష్టాలు తీరాలని ఇంకొందరు.. ఉన్నత శిఖరాలు చేరుకోవాలని యువత, విద్యార్థులు ఆకాంక్షిస్తున్నారు. గత ఏడాదిలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, మునుపెన్నడూ లేనంతగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు ఒకింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజల బతుకులను ఛిద్రం చేస్తున్నాయి. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో వస్తున్న కార్పొరేటీకరణ ప్రజల జీవనాన్ని, ఆర్థిక పరిస్థితిని తలకిందులు చేస్తోంది. గత ఏడాది పంటలు బాగా పండినా పలుమార్లు కురిసిన భారీ వర్షాలతో రైతులు కష్టనష్టాలను చవిచూశారు. ప్రభుత్వ విధానాలతో కార్మికులు, రైతులు, ఉద్యోగులు అన్ని రంగాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాగు భూములను కార్పొరేట్ శక్తుల పరం చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడంతో రైతులంతా ఆందోళన చెందారు. జాతీయ రహదారులు, ఎంఎస్ఎంఇ పార్కులు, హోటళ్లు, ఐటి కంపెనీలు, పరిశ్రమల పేరిట భూములను లాగేసుకుంటుండడంతో అంతటా ఆందోళన నెలకొంది. కనీస వేతనాలు లేక స్కీంవర్కర్లు ఇబ్బందులు పడ్డారు. వీటన్నింటినీ అధిగమించి కొత్త సంవత్సరంలోనైనా తమ బతుకులు బాగుండాలని జిల్లా ప్రజానీకం కోరుకుంటోంది.

జనం మనసుల్లో మెలిగే ఆశలు, ఆకాంక్షలు, కొత్తకొత్త ఆలోచనలు ఆచరణాత్మకం కావాలని, మంచి ఫలితాలను ఇవ్వాలని, ముఖ్యంగా పుట్టెడు సమస్యలతో సతమతమౌతున్న రైతులు, ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్‌వర్కర్లు, చిరువ్యాపారుల కష్టాలు తీరాలని, అందరికీ మేలు జరగాలని, మంచి ఆరోగ్యం సిద్దించాలని ఆకాంక్షిద్దాం

ప్రజలకు మంచి జరగాలి

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కొత్త సంవత్సరంలో మంచి జరగాలి. రానున్న ఏడాదిలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి.జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2025 వ సంవత్సరంలో వైసిపిని ముందుకు నడిపించడంలో సహకరించిన పార్టీ నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు.

మజ్జి శ్రీనివాసరావు
వైసిపి జిల్లా అధ్యక్షులు

ప్రజలకు మరింత మేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. కొత్త సంవత్సరంలో కూడా సుఖ సంతోషాలతో ఉండాలి. ఎన్నికల హామీలు సూపర్‌సిక్స్‌ను నెరవేర్చాం. విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం. పింఛన్లతో వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగుల్లో ఆనందాన్ని నింపుతున్నాం. నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలు వరించాలని ఆకాంక్షిస్తున్నాను.

కొండపల్లి శ్రీనివాస్
రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి

అభివృద్ధి, సంక్షేమంతో స్వర్ణాంధ్ర సాకారం

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, 'సూపర్ సిక్స్' హామీలు రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. కొత్త సంవత్సరం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటు న్నాను. వారికి మరింత మేలు జరిగే కార్యక్రమాలు చేపడతాం.

గుమ్మడి సంధ్యారాణి
రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖా మంత్రి

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి. అనుకున్న లక్ష్యాలను సాధించాలి. జిల్లా అభివృద్ధి పథంలో నడిచేసేందుకు సహాయ సహకారాలు అందించాలి.

ఎస్.రాంనారాయణరెడ్డి
కలెక్టర్, విజయనగరం జిల్లా

పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలి

రాబోయే నూతన సంవత్సరంలో కూడా పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలి. గత ఏడాది జిల్లాపోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో అంకిత భావంతో పనిచేసినందుకు అభినందనలు. ప్రజలకు మెరుగైన సేవలందిం చడంలో ప్రతి ఒక్కరూ విధులను నిబద్ధతో నిర్వహించారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం, విజయాలు కలగాలి.

ఎఆర్ దామోదర్
జిల్లా ఎస్‌పి, విజయనగరం

ప్రజల ముఖాల్లో చిరునవ్వు నింపడమే లక్ష్యం

'ముస్తాబు' ద్వారా పల్లెలు సుందరీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికారులు తమ విధులను సంతోషంగా నిర్వర్తించినప్పుడే జిల్లాను సంతోషంగా ఉంచగలమని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి హితవుపలికారు. బుధవారం ఏర్పాటు చేసిన గుడ్ గవర్నన్సీస్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ ప్రత్యేక అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం, కలెక్టర్ తరపున గ్రామాల్లో ప్రతినిధులుగా ఉన్న ప్రత్యేక అధికారులు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సచివాలయ వ్యవస్థపై ప్రజలకు అపారమైన నమ్మకమన్నారు. గ్రామాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా ప్రజలు ముందుగా సచివాలయం వద్దకు వెళు న్నారని, ఇది ప్రభుత్వం, సచివాలయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రజల సమస్యను పరిష్కరించి వారి ముఖాల్లో చిరునవ్వు నింపగల ప్రతిభ మీలో ఉందని, అటువంటి మీరు ఎప్పుడూ ఉత్సాహంగా ఉండడం అవసరమని అన్నారు. ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుతూ, వచ్చే నూతన సంవత్సరంలో ప్రజల్లో చిరునవ్వు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

నింపడమే లక్ష్యంగా మీరు మీకు కేటాయించిన గ్రామాల్లోనే ప్రజల మధ్య వేడుకలు జరుపుకోవాలని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళిక గ్రామాల్లో తలెత్తే సమస్యలను

తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రగతి పై ఆరా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కొట్టాం గ్రామంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువులపై ఆరా తీశారు. మంగళవారం రాత్రి ఉపాధ్యాయులు కొట్టాం గ్రామంలో గల విద్యార్థుల ఇంటికి వెళ్లి కొట్టాం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువు, ఆరోగ్యం, క్రమశిక్షణ తదితర విషయాల పట్ల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను తల్లిదండ్రుల ముందే వివిధ సబ్జెక్ట్‌లను చదివించి విద్యార్థుల ప్రతిభను అందరూ అభినందించారు. బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొట్టాం హైస్కూల్ ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎఇ గంగాధర్

నిర్మాణాలు పూర్తి చేయకపోతే రద్దు

ప్రజాశక్తి - వేపాడ

గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణాలను చాలా మంది మధ్యలో నిలిపేశారని అటువంటి వారంతా జనవరి నెలాఖరి నాటికి నిర్మాణం పూర్తి చేయకపోతే ఇంటి నిర్మాణాలను రద్దు చేస్తామని హౌసింగ్ ఎఇ గంగాధర్ హెచ్చరించారు. బుధవారం మండంలోని వల్లంపూడి గ్రామంలో ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వం ఇల్లు లేని వారిని 1395 మందిని గుర్తించి స్థలాలు మంజూరు చేసిందని, వీరిలో 1211 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పూర్తి చేశారని చెప్పారు. లబ్ధిదారులు లింటల్ లెవెల్ వరకూ నిర్మించినా ప్రభుత్వం రూ.2లక్షలు నిధులు మంజూరు చేసిందని, దీంతో చాలా మంది నిధులు చాలాక అసంపూర్తిగా నిర్మాణాలను ఆపేశారని పదేపదే గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు చెబుతున్నామని అన్నారు.

రథానికి విరాళాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రీవేణుగోపాల స్వామి ఆలయం రథం ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో విరాళాలు ఇచ్చేందుకు జనం ముందుకు వస్తున్నారు. మల్లమ్మపేటకు చెందిన తెంటు రమేశ్ రూ.1,01,116, కంటి వైద్యులు కెవి అప్పారావు రూ.1,11,116, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాస రావు రూ.50,116, వైద్యులు రామ్‌నరేష్ రూ.50,116, తూముల భాస్కరరావు రూ.1లక్ష, జి. మానస రూ.10116, బి. నారాయణమ్మ, రూ.10వేలు, బి.శివకృష్ణ, రూ.11,111, ఆర్.వెంకటనాయుడు, రూ.10,116, ఎ.రమేష్ రూ.10వేలు, ఇ. అప్పలనాయుడు రూ.10వేలు, పట్టణానికి చెందిన నంది హరిప్రకాష్ రూ.30,001, పాత బొబ్బిలికి చెందిన బి.సురేష్ రూ.3,337 బేబినాయనకు అందించారు. దాతలను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు.



విరాళాలను సేకరిస్తున్న ఎమ్మెల్యే

పింఛను డబ్బు సచివాలయంలో ప్రత్యక్షం

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని మండవకురిటి సచివాలయంలో మంగళవారం పోయిన పింఛన్ డబ్బు బుధవారం తిరిగి సచివాలయంలో ప్రత్యక్షమయ్యాయి. మంగళవారం పింఛన్ల పంపిణీ కోసం తెచ్చిన సొమ్ములో రూ.50వేలు పోయాయి. పింఛన్ నగదు లేకపోవడంతో గ్రామంలో కలకలం రేగి, విషయం నేరుగా పోలీస్ స్టేషన్ వరకు చేరింది. దర్యాప్తు ప్రారంభమవడంతో సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సచివాలయంలోకి అడుగుపెట్టిన ఉద్యోగులు అనూహ్యమైన దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. మంగళవారం కనిపించని రూ.50 వేల నోట్ల కట్ట, ఒక్కసారిగా కుర్చీ కింద పడి ఉండటం అందరినీ అవాక్కయ్యేలా చేసింది. వారు వెంటనేపై అధికారులకు సమాచారం అందించారు. ఈ పరిణామంతో గ్రామంలో చర్చలు మళ్లీ ముదిరాయి. డబ్బు బయటకు తీసి వెళ్లిన వ్యక్తి, ఫిర్యాదు పోలీసులకు చేరిందని తెలిసి భయపడి, రాత్రికిరాత్రే కిటికీ ద్వారా తిరిగి విసిరేశాడా? అనే అనుమానం స్పష్టంగా కనబడుతోంది. బయటివారి కన్నా ఇంటి వ్యక్తే ఈ దొంగతనానికి కారణమనే అభిప్రాయం బలపడుతోంది. పూర్తి మొత్తాన్ని తీసుకుంటే వెంటనే అనుమానం వస్తుందని, కొంత భాగం తీసుకుంటే ఎవరూ గమనించరని భావించి ఈ ప్రయత్నం చేశాడని భావిస్తున్నారు. ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేపట్టడంతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ఉద్యోగులు, డబ్బు తిరిగి దొరకడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ డబ్బు సచివాలయంలో మాయం కావడం పట్ల ఉన్నతాధికారులు కూడా తీవ్రంగా స్పందించగా, ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలకు సిద్ధమవుతున్నారని సమాచారం.

సచివాలయంలో లభ్యమైన డబ్బులు (వృత్తంలో)

వేతనం కట్ చేయడం తగదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్ యాజమాన్యం క్రిస్మస్ సందర్భంగా గుర్తింపు లేని కార్మిక సంఘానికి కార్మికుల వేతనాల నుంచి రూ.200 చందా కట్ చేయడం తగదని నెల్లిమర్ల జ్యూట్‌మిల్ కార్మిక సంఘం (ఇఫ్టూ అనుబంధం) అధ్యక్షులు నామాల తిరుపతిరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల అంగీకారం లేకుండా, జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా యాజమాన్య అనుకూల యూనియన్‌కి సంక్రాంతి సందర్భంగా చందాల పేరిట కార్మికుల వేతనాల నుంచి విరుపుదల చేసి దోచిపెట్టడానికి పూనుకుంటుందని చెప్పారు. ఈ చర్యను కార్మికులు వ్యతిరేకించినా యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదని చెప్పారు. ఈ సమస్యపై డిప్యూటీ లేబర్ కమిషనర్, నెల్లిమర్ల తహశీల్దార్‌కి వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. జూట్ యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మద్దిల అప్పలనాయుడు, అప్పలసూరి, పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొప్పెర్ల గ్రామంలో క్షయ (టీబీ) వ్యాధితో బాధపడుతున్న రోగులకు మానవతా దృక్పథంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు వైసిపి నాయకులు భావి శెట్టి నారాయణరావు తెలిపారు. వైద్య సిబ్బంది అభ్యర్థన మేరకు గత ఆరు నెలలుగా క్షయ వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం కూడా పలువురు క్షయ వ్యాధిగ్రస్తులకు అవసరమైన పౌష్టికాహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భావిశెట్టి నారాయణరావు మాట్లాడుతూ, గ్రామంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న ప్రతి ఒక్కరు పూర్తిగా ఆరోగ్యవంతులు అయ్యే వరకు ప్రతి నెలా పౌష్టికాహారం అందజేస్తానని హామీ ఇచ్చారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మందుల ప్రభావం మెరుగుపడుతుందని, రోగులు త్వరగా కోలుకునేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న క్షయ నిర్మూలన కార్యక్రమాలకు తోడుగా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం పలువురి మన్ననలు పొందగా, భావి శెట్టి నారాయణరావు ఉదార స్వభావాన్ని గ్రామస్తులు, రోగుల కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న నాయకులు

కల్వర్టు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక బజారు నాలుగు రోడ్ల కూడలిలో కల్వర్టు పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదు మేరకు బుధవారం బజారు కల్వర్టు పనులను పరిశీలించారు. పండగకు ప్రజలు, వ్యాపారాలు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. పూర్తిగా పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా ఉంటూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన రాణిమల్లమ్మ దేవి చెరువుగట్టును వాకింగ్ ట్రాక్‌గా మార్చడంలో కృషి చేసిన ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. కోరాడ వీధి వైపు నిర్మాణం జరగవలసిన కల్వర్టును త్వరితగతిన పూర్తి చేసి వాకింగ్ ట్రాక్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కల్వర్టును పరిశీలిస్తున్న కమిషనర్

స్తంభం మార్పుతో ఇబ్బందులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చిన్నగుడిపాల గ్రామంలో వేచాలపు సాయికుమార్ ఇంటి ముందున్న విద్యుత్తు స్తంబాన్ని ఇంటి వెనుక ఏర్పాటు చేయడం వల్ల ఆ ఇంటిపై నుంచి విద్యుత్తు వైర్లు వెళతాయని దీంతో ఆ కుటుంబానికి ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని మాజీ సర్పంచ్ ఎస్‌బి జనాదేవ్ తెలిపారు. బుధవారం విద్యుత్తు స్తంభాన్ని మార్చిన సిబ్బందితో ఆయన వారించారు. ఈ విషయంపై ఎఇ పిచ్చయ్యని వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి ప్రమాదం జరగకుండా తగులు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కష్టపడిన వారికి గుర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు బుధవారం ఎల్‌కోట పార్టీ కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజవర్గంలో కార్యకర్తలు, నాయకులు, యువత విస్తృతంగా మై టిడిపి యాప్‌ను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లు నానిగిరి రమణాజీ, గనివాడ బంగారునాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ జిఎస్ నాయుడు, ఎఎంసి ఛైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, ప్రధాన కార్యదర్శి గండి శ్రీరామ్మూర్తి, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్‌కుమార్, అనకాపల్లి చెల్లయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి పెదగాడ రాజు, బొట్ట రమణ, హరిగోపాల్, గేదెల అప్పలరాజు, ఈశ్వరరావు, మోపాడ చిన్నకృష్ణ, కారం అప్పారావు, అడారి రమేష్, కర్రీ ఈశ్వరరావు, మోపాడ కోటిబాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంశ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శతవసంతాల వేడుకలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో శతవసంతాల వేడుకలు జరుగుతున్నాయని ఈ వేడుకల్లో కార్మికులు, కర్షకులు, ప్రజలు, యువజనులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. బుధవారం పూల్ బాగ్ సెంటర్ వద్ద సిపిఐ శతవసంతాల వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందని, 2026కు వందేళ్లు పూర్తికానున్నాయని అన్నారు. ఈ 100 ఏళ్ల ప్రస్థానంలో ఈ దేశంలో దోపిడీ పీడనలు లేని సోషలిస్ట్ సమాజ లక్ష్యంగా పార్టీ పని చేస్తుందని. నిత్యం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేసి ప్రజలకు రావాల్సిన హక్కులు సాధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ నాయకులు గొల్లపల్లి తౌడు, లచ్చన్న బీహేన్, జీర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎఇకి స్వాగతం పలుకుతున్న స్టిబంది

ఎఇ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎలక్ట్రికల్ ఎఇగా పిచ్చయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లిమర్ల నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ సిబ్బంది పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ప్రజల ఆకాంక్షలను తీరుస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం. కొత్త సంవత్సరంలో కూడా ప్రజల ఆకాంక్షలను తీరుస్తాం. నియోజకవర్గంలో ప్రజలకు మరిన్ని విజయాలు కలగాలి. రహదారులు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

తోయక జగదీశ్వరి, ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే

సుఖశాంతులతో మెలగాలి

నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సరాన సుఖశాంతులు కలగాలి. అభివృద్ధి వైపు పయనించాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ జగ్రత్తలు తీసుకోవాలి. 2025లో సాధించిన విజయాలు ప్రజలకు చేరువయ్యాయి. సూపర్ సిక్స్‌పథకాలు సూపర్ హిట్ అయ్యాయి.

కోండ్రు మురళీమోహన్, రాజాం ఎమ్మెల్యే

కష్ట సుఖాల్లో కలిసుంటా..

ప్రజల కష్ట సుఖాల్లో కలిసి ఉంటాను. నూతనస సంవత్సరం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి. దేశంలోనే ఉత్తమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 18 నెలల్లోనే ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. విజయనగరం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యానికి కృషి చేశాను. లో వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశాం. కొత్త ఏడాది మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాను. ప్రజలతో మమేకమై ప్రజల కష్టాలను తెలుసుకుంటాం.

పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యే

సుఖశాంతులు కలగాలి

జిల్లా కేంద్రంలో పిజి సెంటర్ ఏర్పాటు చేయిస్తాను. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం, ఇతర జిల్లా కార్యాలయాల భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. వైద్య కళాశాల ఏర్పాటు చేయిస్తాను. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తాను. పార్వతీపురం పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తాను. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జంఝావతి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తాను. తోటపల్లి ప్రాజెక్టు పెండింగ్ పనుల పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాను. 2026లో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి కృషి చేస్తా. కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో, భోగభాగ్యాలతో తులతూగాలి.

బోనెల విజయచంద్ర, పార్వతీపురం ఎమ్మెల్యే

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కార్పొరేటర్లకు, కో ఆప్షన్ సభ్యులకు, కార్యాలయ సిబ్బందికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు. 2026 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో మంచే జరగాలి. అందరి సహకారంతో నగరం మరింత అభివృద్ధి దిశగా పయనించాలి. ఆనందోత్సాహాలతో ప్రతి ఒక్కరి కుటుంబాలు సంతోషంగా ఉండాలి.

వి.విజయలక్ష్మి
నగర మేయర్, విజయనగరం

మరిన్ని శుభాలు కలగాలి

నగర ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధించి, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. అందరికీ శుభాలు కలగాలి.

పి.నల్లనయ్య, నగరపాలక సంస్థ కమిషనర్

మంత్రి సంధ్యారాణికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

సాలూరులోని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి క్యాంపు కార్యాలయానికి వెళ్లి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి మంత్రి సంధ్యారాణి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నూతన సంవత్సరంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి కన్వీనర్ అడ్డాకుల నరేష్, నాయకులు వెంపడాపు భారతి, నాగేశ్వరరావు, సురేష్, హితేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

భామిని: మండలంలోని వంశధార సమీప గ్రామాలైన బిల్లుమడ, బత్తిలి లో అక్రమ ఇసుక తరలింపు పై బుధవారం తహసీల్దార్ శివన్నారాయణ, ఎస్ఐ అప్పారావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇసుక లోడ్‌తో ఉన్న 4 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇక్కడ నుంచి ఇసుకని తరలించి వేరే ప్రాంతం లో ఇసుక డంప్ చేసి ఇసుక అమ్మకాలు సాగిస్తున్నట్లు గుర్తించామని రెవిన్యూ సిబ్బంది తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను బత్తిలి స్టేషన్‌కు తరలించారు.

రానున్న కాలంలో మరింత మంచి పాలన

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చామని, రానున్న కాలంలో మరింత మంచి పాలన అందిస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 18 నెలల్లోనే ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన తొలిరోజే తొలి సంతకంతో పింఛనును రూ.4వేలకు పెంచామన్నారు. అన్నదాత సుఖీభవ, 5 రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంను ఆర్థిక రాజధానిగా చేయడానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి ఎన్నో ఐటీ కంపెనీలను తీసుకువస్తున్నారని తెలిపారు. వీటివల్ల యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

చంద్రశేఖరరావుకు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం

మహారాజా కళాశాల రసాయన శాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ గురుబిల్లి చంద్రశేఖరరావు అస్సాం రాష్ట్రం గౌహతిలో జరిగిన అష్టలక్ష్మి యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం టీమ్ లీడర్‌గా నియమితులయ్యారు. డిసెంబర్ 15 నుంచి 28 వరకు మొత్తం 14 రోజులు పాటు గౌహతి ఐఐటీలో ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సౌజన్యం తో ఉత్తర ఈశాన్య కౌన్సిల్, భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహించిన ఈ ప్రోగ్రామ్ కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరపున 20 మంది విద్యార్థు లు హాజరయ్యారు. వీరి టీమ్‌కు లీడర్‌గా చంద్రశేఖర్ రావు నాయకత్వం వహించారు. చంద్రశేఖర్‌తో పాటు మహారాజా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మధులత, విశ్వేశ్వరి, టి.వేణు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, విశ్వేశ్వరి, మధులత, వేణు లను మహారాజా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు అభినందించారు. అభినందన సభలో అకడమిక్ కన్వీనర్ పిఎస్ఎన్ రావు, అడ్మినిస్ట్రేటివ్ కన్వీనర్ డి.సన్యాసిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ నుంచి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కుంపల్లి కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడువాడ దేవుడు నాయుడు (23) మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మ గ్రామానికి చెందిన దేవుడు నాయుడు అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు గంధం మహేష్‌తో కలిసి బిరియాని కోసం కుంపల్లి కూడలి వద్దకు వచ్చారు. అక్కడ బిరియాని కొనుగోలు చేసి తిరిగి కొత్తవలస దేవరాపల్లి రోడ్డు దేవరాపల్లి వైపు వెళుతుండగా కుంపల్లి దాటిన తరవాత మలుపు వద్ద బండి నడుపుతున్న గంధం మహేష్ ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును చూసి ఒక్కసారిగా కంగారుపడి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక కూర్చున్న దేవుడునాయుడు రోడ్డుపైకి తుళ్లిపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ సుదర్శనరావు తెలిపారు.

నిందితుల నుంచి రికవరీ చేసిన సొత్తుతో ఎఎస్‌పి, సిఐ, ఎస్ఐ

ఆలయ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి- పార్వతీపురం

సీతానగరం మండలం లచ్చయ్యపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో నవంబరు 1న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆలయ చోరీ కేసులో పాత నేరస్తులు పోలా భాస్కరరావు, సవర సూర్యంను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు బుధవారం ఎఎస్‌పి మనీషా రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 9.40 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. రికవరీ చేసిన వాటిలో 92 గ్రాముల బంగారం, 5 కిలోల 396 గ్రాముల వెండి వస్తువుల లను మీడియా ముందు ప్రదర్శించారు. స్వాధీనం చేసుకున్న సొత్తులో లక్ష్మీదేవి ప్రతిమలు, వెండి కిరీటాలు, శఠగోపాలు ఉన్నాయి. నవంబర్ 1న ఆలయంలో చోరీ జరగ్గా, దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అయితే ఇటీవల ఇద్దరు నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో జైలు గోడల మధ్యే శిక్ష అనుభవిస్తూనే లచ్చయ్యపేట ఆలయ దోపిడీకి స్కెచ్ గీసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. మొత్తం చోరీ అయిన సొత్తు విలువ రూ. 10.75 లక్షలు కాగా, ఇంకా కొంత రికవరీ చేయాల్సి ఉందన్నారు. మిగిలిన వస్తువుల రికవరీ కోసం దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. సమావేశంలో పార్వతీపురం రూరల్ సిఐ రంగనాథం, సీతానగరం ఎస్సై ఎం.రాజేష్ సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలు అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రామస్వామిపేట గ్రామానికి చెందిన పత్రి రామయ్యమ్మ(70) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచ చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామయ్యమ్మ, ఈ నెల 24న తన ఇంటి నుంచి బయలుదేరి ఎల్‌కోట మండలంలోని కిత్తన్నపేట గ్రామంలో ఉన్న తన అన్నయ్య ఇంటికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. అయితే ఆమె అక్కడికి చేరుకోలేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. మరుసటి రోజు విశాఖపట్నం గోపాలపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో రామయ్యమ్మ కనిపించిందని పరిచయస్తుల ద్వారా సమాచారం అందడంతో, కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఆమె ఆచూకీ కోసం విస్తృతంగా వెతికారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం దక్కలేదని తెలిపారు. దీంతో రామయ్యమ్మ కుమారుడు పత్రి ఎర్రినాయుడు బుధవారం వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో తన తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ముఖాల్లో చిరునవ్వు నింపడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించడంలో అధికారులు అనుసరించాల్సిన విధానాన్ని ఆయన వివరించారు. గ్రామ ప్రత్యేక అధికారులు సంబంధిత శాఖల సమన్వయంతో, గ్రామ పెద్దల సహకారంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒకవేళ గ్రామ స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే వెంటనే తహశీల్దార్, ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లాలని, అక్కడా వీలుపడని పక్షంలో జిల్లా స్థాయి అధికారులకు పంపించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. అలాగే చెరువులను పరిశుభ్రంగా ఉంచి, అందంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి పల్లెలో 'ముస్తాబు' కార్యక్రమం ద్వారా పరిశుభ్రత వెల్లివిరియాలని, ప్రజలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. సామాజిక బాధ్యతగా మంచి అలవాట్లు, దుర్వ్యసనాల కారణంగా కలిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని, యువత, ప్రజలు మంచి అలవాట్ల వైపు మళ్లేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చేతిలో గ్రామ స్థాయిలో వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ సిబ్బంది సుమారు 40 మంది ఉంటారని వారి ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని అలా చేయడానికి ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో ఒకర్ని చూసి మరొకరు నేర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణ, మొక్కలు నాటడం వంటి చిన్న పనులతో సామాజిక బాధ్యతను మొదలుపెట్టాలని, ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించుకుంటూ వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు అంకితభావంతో పనిచేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డ్వామా, డిఆర్‌డిఎ పీడీ కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎస్.మన్మధ రావు, ఉద్యానవన శాఖ అధికారి కెవిఎస్ రెడ్డి, డిఇఒ బ్రహ్మాజీరావు, సీతంపేట ఎపిఒ చిన్నబాబు, డిపిఒ కొండలరావు, ట్రైబల్ వెల్ఫేర్ డిడి విజయశాంతి, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల కట్టడికి పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాతా శిశు మరణాల రేటును సున్నాకు తీసుకురావడమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్య శాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మాతా శిశు మరణాల నివారణ - సమీక్షా సమావేశంలో మరణాలకు గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. రక్తహీనత, అధిక రక్తపోటు కలిగిన గర్భిణీలను హై-రిస్క్ కేసులుగా గుర్తించి, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ప్రసవం ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని, సురక్షిత



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రసవాల ద్వారానే మాతా శిశు మరణాలను అరికట్టవచ్చని తెలిపారు. గర్భిణీలను సకాలంలో ఆసుపత్రులకు తరలించేలా '102', '108' వాహనాలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. శిశువు జన్మించిన తర్వాత మొదటి కొన్ని గంటలు అత్యంత కీలకమని, పసిబిడ్డల ఆరోగ్య విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. లో-బర్త్ వెయిట్ (తక్కువ బరువు) కలిగిన శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మాతా శిశు మరణాలపై నిర్వహించిన 'డెత్ ఆడిట్'లో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. మరణాలు సంభవించిన ప్రతి కేసును లోతుగా పరిశీలించి లోపాలను సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

హామీలను నెరవేర్చాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఏవైతే ప్రజలకు సూపర్ సిక్స్ హామీ ఇచ్చామో వాటన్నింటినీ అమలు చేశామన్నారు. ఇరిగేషన్ మైనర్ ఇరిగేషన్ పోలవరం ప్రాజెక్టు వంటి వాటికి అధిక ప్రాధాన్యతిస్తూ వచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.5వేల కోట్లతో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. డిఎస్‌సి ద్వారా 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. 6వేల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులను నియమించామన్నారు. ధాన్యం కొనుగోలులు రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా 24 గంటల్లోపే వారి అకౌంట్లలో డబ్బులు వేశామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేసిందన్నారు. అన్నిటికంటే స్త్రీ శక్తి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, ఆడపిల్లల చదువుకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టులో ఈనెల 4న ట్రైలర్ నిర్వహిస్తామని తెలిపారు.

పన్నుల వసూళ్లపై అసంతృప్తి

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు గరంగరం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాల్టీలో ఆస్తిపన్ను, ఇతర పన్నుల వసూళ్లలో రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తొలుత కౌన్సిలర్లు బలభద్రుని శ్రీనివాసరావు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, గిరి రఘు రెవెన్యూ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి సకాలంలో పన్నులు ఎందుకు వసూలు చేయడంలేదని నిలదీశారు. పన్నుల వసూళ్లలో వెనుకబాటు వల్లే మున్సిపాల్టీకి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదని చెప్పారు. దీనిపై రెవెన్యూ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ పన్నుల వసూలు కోసం తిరుగుతున్నామని, ఫిబ్రవరి, మార్చినెలల్లో చెల్లించడం వ్యాపారులకు ఆనవాయితీగా మారిందని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో రహదారుల పక్కన ఎక్కడపడితే అక్కడ అనధికార దుకాణాలు వెలుస్తున్నాయని, వీటి వల్ల వాహనాల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని కౌన్సిలర్ మాధవరావు చెప్పారు. అనంతరం సభ్యులు మున్సిపల్ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కమిషనర్ రత్నకుమార్, మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త ఏడాదైనా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కురుపాం

మన్యం ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న రహదారులు, త్రాగునీరు, ఆరోగ్య-విద్యా సదుపాయాల కొరత వంటి కీలక సమస్యలను కొత్త సంవత్సరంలోనైనా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన కురుపాంలో పత్రికా విలేకరులతో మాట్లాడారు. దూరంగా ఉన్న గ్రామాలకు సకాలంలో రవాణా సౌకర్యం లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా గిరిజన కుటుంబాలు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రుల దూరం, రోడ్ల లేమి కారణంగా ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఇంకా తీవ్రంగానే ఉందని, మహిళలు ఎండాకాలంలో కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చే పరిస్థితి మారాలని ఆయన కోరారు. గిరిజనులకు విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రాకపోతే అభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు మన్యం ప్రాంతాల పట్ల ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుభిక్షమైన పాలన ద్వారా గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కులు, సంక్షేమంపై మరింత శ్రద్ధ తీసుకుంటేనే మన్యం ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. బుధవారం ఆయన ఐటిడిఎ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా రక్త పరీక్షలు చేయించాలన్నారు. డ్రైడే - డ్రైడే క్యాంపును నిర్వహించాలన్నారు. ముస్తాబు కార్యక్రమం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదులు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో మొక్కలు పెంచాలన్నారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. గడువు ముగిసిన పాల ప్యాకెట్లను గానీ, ఇతర తిండి పదార్థాలు గానీ విద్యార్థులకు ఇవ్వకూడదని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వండిన భోజనం రుచికరంగా ఉండాలని, అదే విధంగా భోజనం వృథా

మాట్లాడుతున్న పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

చేయకూడదని అన్నారు. అన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంటు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, సెప్టిక్ ట్యాంక్ లను క్లీనింగ్ చేయాలని సూచించారు. విద్యా ప్రగతి కార్యక్రమం పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు, ఎటిడబ్ల్యూవో మల్లికార్జునరావు, రాంబాబు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశంస పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే

టిడిపికి కార్యకర్తలే బలం

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తల కృషి అమూల్యమని, పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలను ఆమె అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్యకర్తలను పార్టీ గుర్తించి గౌరవించిందన్నారు. పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్త నిలబడితేనే పార్టీ నిలబడుతుందన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కార్యకర్తలేనన్నారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందుకున్న ఉత్తమ కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ తమ సేవలను గుర్తించి ఇలాంటి ప్రోత్సాహం ఇవ్వడం మరిచిపోలేని సంఘటనగా భావిస్తున్నామని తెలిపారు. ఈ గౌరవం తమలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

చట్టరీత్యా బాల్యవివాహాలు నేరం

ప్రజాశక్తి - కురుపాం

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, న్యాయ వ్యవస్థ చట్టాలపై మండలంలోని దురుబిలి గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతులకు కనీసం 18ఏళ్లు, యువకులకు 21 ఏళ్లుగా పూర్తయిన తర్వాతే వివాహాలు జరపాలని తెలిపారు. అలాగే న్యాయపరమైన సమస్యలుంటే తమను సంప్రదిస్తే కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పువ్వల పత్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినియోగదారుడా మేలుకో

ప్రజాశక్తి - సాలూరు

వినియోగదారుల మండలి గౌరవ అధ్యక్షులు బల్ల వేణుగోపాలరావు, డిప్యూటీ తహశీల్దార్ కిరీటితో కలిసి వినియోగదారుల హక్కులపై రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వ్యాపార సంస్థలు, వ్యక్తులు వినియోగదారులను రకరకాలుగా మోసగిస్తున్నారని, వాటిని గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉంటాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతను పరిశీలించుకోవాల్సిన బాధ్యత వినియోగదారుడిపైనే ఉందని గుర్తు చేశారు. ఒకవేళ మోసపోయినట్లు గుర్తిస్తే, వెంటనే సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోని పట్టణానికి చెందిన షేక్ మౌలాలీకి సాలూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆశెట్టి గున్నయ్య గుప్తా బియ్యం, బట్టలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వినియోగదారుల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

బాలల ఆరోగ్యమే ధ్యేయంగా డిఇఐసి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించినప్పుడే భవిష్యత్ బలంగా ఉంటుందని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. జిల్లా కేంద్రంలో గల బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి అక్కడ సేవలపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు డిఈఐసిలో చిన్నారులకు అందజేసిన సేవల వివరాలు ,నివేదికలు, నిర్వహణ ప్రక్రియ, పురోగతి, ఇంకా మెరుగు పర్చుకో వాల్సిన అంశాలపై విశ్లేషించారు. సిబ్బంది వారిగా వారు నిర్వర్తిస్తున్న వైద్య సేవలు, ఎర్లీ ఇంటర్వెన్షన్, థెరపీలు, వైద్య పరీక్షలు, నిర్వహణ ప్రక్రియపై తెలుసుకొని బాలల ఆరోగ్యం మెరుగు, పర్యవేక్షణపై ఎక్కువగా దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ 4డిలు అయినటువంటి పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఎదుగుదలలో జాప్యం, శారీరక మానసిక వైకల్యంతో ఉన్నవారికి డిఈఐసి కేంద్రంలో చికిత్స, పర్యవేక్షణ

సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

అందిస్తున్నామన్నారు. 4డిలు గుర్తించే లక్ష్యంగా అంగన్వాడీ, పాఠశాల పిల్లలకు ఆర్.బి.ఎస్.కె హెల్త్ స్క్రీనింగ్ వైద్యారోగ్యశాఖ చేపడుతుందన్నారు. ఈ సంవత్సరానికి ఇప్పటివరకు కేంద్రంలో ప్రతి రోజూ ఓపి ద్వారా 3209 మంది పిల్లలకు తనిఖీలు, పర్యవేక్షణ నిర్వహిస్తున్నామన్నారు. పెదవి చీలిక, వంకర పాదాలు, గుండె (సిహెచ్.డి), కంటి సంబంధిత సమస్యలతో గుర్తించిన 34 మందికి అనుసంధాన ఆసుపత్రుల ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు చేపడుతున్నామన్నారు. 4డిలతో ఉన్న వారిని త్వరగా గుర్తించి డిఈఐసి కేంద్రంలో తగు చికిత్స, పర్యవేక్షణతో పిల్లలకు ఆరోగ్యకర భవిష్యత్తో అందజేయడంతో పాటు, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్. భరత్ చంద్ర, డెంటల్ వైద్యులు డాక్టర్ సౌజన్య, సైకాలజిస్ట్ కృష్ణవేణి, ఆప్టోమెటిస్ట్ స్వాతి, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్ స్రవంతి, ల్యాబ్ టెక్నీషియన్ రేవతి, స్టాఫ్ లక్ష్మీ, మంగ, ఆర్.కెఎస్.కె కౌన్సిలర్ భారతి, సోషల్ వర్కర్ మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండో పెద్ద నగరంగా విశాఖ ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద నగరం ఇదే. స్వాతంత్ర్యానికి పూర్వం ఒక చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు అతి పెద్ద నగరంగానూ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వంద నగరాలలో ఒకటిగానూ ఉండడానికి ప్రధాన కారణం.. నగరంలో నెలకొన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలే. ఇంకా విశాలంగా చెప్పాలంటే.. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధిలోనూ, దేశ స్వావలంబన సాధించడంలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాయి. అందుకే దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. కానీ నేటి పాలకులు అటువంటి సంస్థలను ధ్వంసం చేయడమే ఒక విధానంగా పెట్టుకున్నారు.

1901 సంవత్సరంలో 40,892 మందిగా ఉన్న నగర జనాభా విశాఖ పోర్టు ట్రస్టు ఏర్పడిన తరువాత 1951 కల్లా రెట్టింపుకుపైగా పెరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనతో ఈ పెరుగుదల క్రమం మరింత పుంజుకుంది. 1951-61 మధ్య పదేళ్ల కాలంలోనే నగర జనాభా రెట్టింపు పెరిగి 2.15 లక్షలకు చేరుకుంది. బిహెచ్‌పివి ఏర్పడిన తరువాత 1971 నాటికి 3,68,000కు జనాభా చేరింది. నేవల్ డాక్‌యార్డ్ విస్తరణ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏర్పడిన తరువాత 1991 కల్లా జనాభా 13.57 లక్షలకు పెరిగింది. ఇదంతా ప్రభుత్వ సంస్థల వల్లనే జరిగింది. ప్రభుత్వ సంస్థలలో మెరుగైన ఉపాధికై అనేక మంది గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వలసలు వచ్చారు. వీటితో పాటు హెచ్‌పిసిఎల్, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల వల్ల 2011లో 17.43 లక్షలు, 2021లో 22.26 లక్షల జనాభా ఉంది. నేడు విశాఖ నగర జనాభా సుమారు 25 లక్షలుగా ఉంది.

ఈ ప్రభుత్వ సంస్థల నిర్మాణం వల్ల వాటిలో పనిచేసే ఉద్యోగుల గృహవసతి, గృహోపకర వస్తువులు వంటి అవసరాలు తీర్చడానికి సర్వీసు రంగం అభివృద్ధి అయింది. ఈ జనాభా ఆహార అవసరాల కోసం సమీప గ్రామాలలో కూరగాయల పంటలు పెరిగాయి. ఇలా పారిశ్రామికీకరణ వల్ల వ్యవసాయ, సర్వీసు రంగాలు కూడా అభివృద్ధి జరిగి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి.

కేవలం జనాభా పెరగడమే కాక, ఇతర అవసరాలకు నగర వైశాల్యం కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. నేడు 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడో పెద్ద నగరంగా నిలిచింది. ఈ పారిశ్రామికీకరణ వల్ల 3,67,529 కోట్ల రూపాయల స్థూల జాతీయ ఉత్పత్తితో దేశంలో తొమ్మిదో సంపన్న నగరంగా ఉంది. వార్షిక బడ్జెట్ 4,171 కోట్ల రూపాయలుగా ఉంది.

అయితే 1991 నుండి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ప్రారంభమైంది. వీటి ప్రభావం విశాఖ నగరంపై కూడా సహజంగానే బలంగా పడింది. మహారత్న కంపెనీగా ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను పూర్తిగా అమ్మేయడం, తరువాత మూతబడడం జరిగింది. విశాఖపట్నం పోర్టు, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి, డాక్‌యార్డ్ వంటి సంస్థలలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదాహరణకు విశాఖపట్నం పోర్టులో 1991 నాటికి 13,019 మంది శాశ్వత కార్మికులుండగా 2021 నాటికి కేవలం 2,700 మంది మాత్రమే ఉన్నారు. షిప్‌యార్డులో 6,795 నుండి ఇదే కాలంలో కార్మికుల సంఖ్య 530 మందికి పడిపోయింది. బిహెచ్‌పివి 4 వేల నుంచి 550కు తగ్గిపోయింది.

విశాఖ నగరానికే కాక, రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగం నుంచి వైదొలగడమంటే అది విశాఖ అభివృద్ధికి అశనిపాతమే. దీనిని పరిరక్షించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ఫలితం శూన్యమే. ఆధునిక టెక్నాలజీ, ఓడరేవు కలిగి దేశంలోనే విశిష్ట స్థానంలో నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే భాధ్యత రాష్ట్ర ప్రయోజనాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉంది.

నగరాభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషించిన ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధిని సుస్థిరం చేసుకోవడం, మరింత అభివృద్ధి సాధించడం సాధ్యం. సాధారణ ప్రజానీకం, అభివృద్ధి కాముకులు ఈ దిశలో కృషి చేసి, ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడమే నేటి కర్తవ్యం. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ హామీకి కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రజలు చైతన్యం చూపాలి. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహిస్తోంది. ఆ సంఘం అఖిల భారత మహాసభ విశాఖలో ప్రస్తుతం జరుగుతుండటం గర్వకారణం.

- ఎ.అజశర్మ,
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఐదో రోజూ అదే జోష్

ఆద్యంతం ఉత్సాహంగా ఆట పాట

చైతన్యం నింపిన గేయాలు

అబ్బుర పరిచిన పులివేషాలు

ప్రజాశక్తి-భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట ఐదో రోజు బుధవారం ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అభ్యుదయ గేయాలు.. ఉత్తరాంధ్ర జానపద కళాకారుల పులివేషాలు అబ్బుర పరిచాయి. "పని గంటలు పెంచి నారు కార్మికుడా.. ఇది తగదంటూ నినదించు శ్రామికుడా", "మానసిక ఒత్తిడికి లోనవుతాను.. శారీరక శక్తినంతా కోల్పోతాను", "గ్యారెంటీ లేని కొలువులు చేస్తావు" అంటూ కళాకారులు పాడిన పాటలు సభికులను ఉత్సాహ పరిచాయి. కార్మికులు తమ శారీరక శక్తినంతా ధారపోసి సంపద సృష్టిస్తున్నా సరే ఉద్యగ భద్రత లేని పరిస్థితులను వివరించారు

ఉత్సాహంగా నృత్యం చేస్తున్న పిఎన్‌ఎం కళాకారులు

కళాకారులు.

విజయనగరం జిల్లాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పులివేషాలు అబ్బుర పరిచాయి. "తెలుగు పండగలు తెల్ల బోయి.. ఇంగ్లిష్ పండగలు ఎక్కిలిస్తున్నాయి", రైతన్నా ఎట్టేట్టో బతికేటోడివి.. ఇట్టేట్టా ఐతివో రైతన్నా.. అంటూ కళాకారులు పాడిన పాటలు సభికులను హత్తుకునేలా చేశాయి. రైతులు సంప్రదాయ బద్ధంగా చేసుకునే భోగి, సంక్రాంతి పండగలు నిర్వచనం మారేలా నిర్వహించుకోవడాన్ని పాడిన పాటలు సభికులను ఆలోచింపజేశాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసమని గిరిజనులను, ఆయా ప్రాంత ప్రజలను గోదాట్లో ముంచేస్తే ఊరుకోబోమని, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని చెబుతూ "అమ్మ పీక నొక్కేసి.. అడవి నుంచి గెంటేసి.. పద పద పద మనది ఒకటే మాటై.. పోరుబాటకై.. ఎర్రజెండా మా వెంటే నడుస్తుంది..' అంటూ కళాకారులు పాడిన పాట ఆద్యంతం ఆలోచనలు రేకెత్తించింది.

"కార్మికులం.. శ్రామికులం. తరతరాల దోపిడీకి నలిగిన కూలీలం.. గాలి, నీరు, భూమంతా నీ సొంతమా? గానుగెద్దు లాంటి బతుకు మాకు సొంతమా" అంటూ సినీ దర్శకులు బాబ్జీ ఒకింత ఆవేశంగా పాట పాడారు. పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం పాలకులు ఎలా వ్యవహరిస్తున్నది ఆయన క్లుప్తంగా పాట ద్వారా వివరించారు.

విజయనగరం కళాకారుల పులివేషాల ప్రదర్శన

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం, పార్వతీపురం మన్యం
గురువారం 1 జనవరి 2026

సాగర తీరంలో కార్మికోత్తేజం

విశాఖ సాగర తీరాన బుధవారం కార్మిక పండగ ఆరంభమైంది. బీచ్ రోడ్డు ఎర్రబారింది. ఒకవైపు ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాగుతున్న శ్రామిక ఉత్సవ్, మరోవైపు అసలు పెద్ద పండగైన సిఐటియు అఖిల భారత మహాసభ.. వెరసి ఈ రెండింటి సందడి అందరిలో ఉత్తేజం నింపాయి. దేశ నలుమూలల నుంచి కార్మిక రంగ ప్రతినిధులు ఈ మహాసభకు తరలివచ్చారు. సోదర కార్మిక సంఘాలు సౌహార్ధ్ర సందేశాలిచ్చాయి. శ్రామిక ఉత్సవ్‌కు సినీ దర్శకుడు బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సాహిత్య వేదికపై కవులు, రచయితలు తమ కవితలు, వ్యాఖ్యానాలతో సందడి చేశారు.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

డ్రగ్స్ అనర్థాలపై పిఎన్ఎం కళాకారుల ప్రదర్శన

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కెఎస్.చలం

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కళాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

బాబ్జీకి జ్ఞాపిక అందజేత

తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

వేదికపై కార్మిక సంఘ అగ్రనేతలు

ప్రతినిధులకు స్వాగతం

శ్రామిక ఉత్సవ్‌లో పెంచలయ్య భార్య దుర్గ తదితరులు

ప్రశంసా పత్రాలతో తప్పెటగుళ్ల కళాకారులు

అల్లూరి స్మారక జ్యోతితో సిహెచ్.నర్సింగరావు, అనకాపల్లి జిల్లా నాయకులు

సౌహార్ధ్ర సందేశాలిస్తున్న నాయకులు

మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాయకులు, ప్రతినిధులు

మాట్లాడుతున్న బాబ్జి, వేదికపై సుబ్బరావమ్మ, ప్రొఫెసర్ చలం తదితరులు

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

'శ్రామిక ఉత్సవ్'లో సినీ దర్శకుడు, రచయిత బాబ్జి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

'దేశంలో ఖనిజ, అటవీ సంపదను ఇద్దరు గుజరాతీలు అమ్ముతుంటే ఇద్దరు గుజరాతీలు కొంటున్నారు. మనది అనేది ఏదీ లేకుండా చేయటమే ప్రస్తుత పాలకుల లక్ష్యం. కార్పొరేట్లకు అన్నింటినీ దోచిపెడుతున్నారు' అని సినీ దర్శకులు, రచయిత బాబ్జి అన్నారు. ఈ క్రమంలో మరో స్వాతంత్ర్య ఉద్యమానికి అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా విశాఖ నగరంలో నిర్వహిస్తున్న 'శ్రామిక ఉత్సవ్' బుధవారానికి ఐదో రోజుకు చేరింది. 'సమాన పనికి సమాన వేతనం' అనే థీమ్‌తో సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు బిడ్డగా తనను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 'ఒక్కసారి అయినా కమ్యూనిస్టుగా బతుకు' అనే పాట రాసిన రచయితగా గుర్తించడం ఆనందదాయకమన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నం నడిబొడ్డున జరుగుతున్న సందర్భంగా తాను ఇక్కడకు వచ్చానని, తాను విద్యార్థిగా ఉన్నప్పుడు విశాఖపట్నం ప్రజానాట్యమండలిలో పాటలు నేర్చుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కార్మికులు, వారిపై జరుగుతున్న దోపిడీపై పాటలు రాస్తూనే ఉన్నానని తెలిపారు. గాంధీజీ, గద్దర్, అల్లూరి మన హీరోలని చెప్పారు. చిన్ననాటి నుండి అల్లూరి విప్లవ భావాలు కలిగిన తనకు విశాఖ అంటే మక్కువ అని చెప్పుకొచ్చారు. బ్రిటిష్ పాలకులు చిన్నచిన్న వ్యాపారాల పేరుతో వచ్చి చాప కింద నీరులా ఎలా వ్యాపించారో.. ఇప్పుడు గుజరాతీయులు కూడా అలాగే వ్యాపిస్తున్నారని తెలిపారు. దేశం బానిసత్వంలోకి వెళ్లే ఛాయలు కనపడుతున్నాయని అన్నారు. మరో స్వాతంత్ర పోరాటం కోసం సిఐటియు జాతీయ మహాసభ పిలుపునివ్వాలన్నారు. విశాఖపట్నాన్ని కాపాడుకునేందుకు సిఐటియు జాతీయ మహాసభలో ప్రతిపాదన చేయాలని కోరారు. సినిమా అనేది ఆనందం, ఆటపాటల కోసం మాత్రమే కాకుండా స్థానిక ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. తాను సినీ పరిశ్రమలో కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్నానన్నారు. సినిమా అనేది లక్షల మందికి చేరే ఒక ప్రధాన సాధనమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ స్త్రీ-పురుష సమానత్వం, కార్మిక-కర్షక ఐక్యత, లౌకిక విలువల కోసం ఈ నెల 27 నుంచి శ్రామిక ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, దేశంలోని 40 శాతం సంపద కేవలం ఒక శాతం మంది వ్యక్తుల వద్దే పేరుకుపోయిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలు ఆదేశిస్తున్నా 'సమాన పనికి సమాన వేతనం' అమలు కావడం లేదని, స్కీమ్ వర్కర్ల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సరైన ఆహారం అందక ప్రతిరోజూ 8 లక్షల మంది చిన్నారులు మరణిస్తుండటం శోచనీయమన్నారు. గుజరాత్ హైకోర్టు సూచించిన విధంగా కనీస వేతనం రూ.24,800 అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేరళను పేదరికం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ ప్రకటించడం వామపక్ష ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కెఎస్.చలం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ రమాదేవి, పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

మహాసభ ప్రాంగణంలోని కళాకృతులు

కార్మికులకు అండ... సిఐటియు జెండా

విజయనగరం జిల్లాలో సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తోంది. 1977లో ఏర్పాటై క్రమక్రమంగా విస్తరించిన సిఐటియు.. నేడు జిల్లాలో బలమైన కార్మిక సంఘంగా ఎదిగింది. జ్యూట్, రైస్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర ఫ్యాక్టరీలు, ఆయిల్‌మిల్లుల కార్మికులతోపాటు విఆర్‌ఎ, విఆర్‌ఒ, పారిశుధ్య కార్మికులు, స్కీమ్‌వర్కర్లయిన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు... ఇలా ఒకటా రెండా అనేక రంగాల్లోని కార్మికులంతా సిఐటియులో చేరి తమ హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నారు. 1977లోనే విజయనగరం జిల్లాలో సిఐటియు ఏర్పాటుకు బీజాలు పడ్డాయి. క్రమక్రమంగా వివిధ రంగాలకు విస్తరించి 1991లో బొబ్బిలిలో సిఐటియు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించుకుంది. అప్పటి నుంచి వెనుతిరగకుండా కార్మికుల పక్షాన నికరంగా నిలబడి సమరశీల పోరాటాలు నిర్వహిస్తోంది.

విశాఖ జిల్లాలో విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో భాగంగానే నెల్లిమర్ల జ్యూట్ మిల్లును బ్రిటీష్ వారే నిర్మించారు. బ్రిటీష్ పెట్టుబడిదారులే ఈస్టుకోస్టు జ్యూట్ మిల్లు కూడా నిర్మించారు. క్రమంగా అరుణ, బొబ్బిలిలో గోపాలకృష్ణ, కొత్తవలసలో ఉమా, సాలూరులో జీగిరాం జ్యూట్ మిల్లులు నిర్మాణం జరిగింది. కార్మిక సంఘాల నిర్మాణం విషయంలో యజమాని, ప్రభుత్వం నిర్బంధాన్ని ఎదుర్కొని కార్మికులు తీవ్రంగా పోరాడారు. క్రమంగా గరివిడి ప్రాంతంలో మైనింగ్‌తోపాటు ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ, బొబ్బిలి, సీతానగరంలో రెండు చక్కెర ఫ్యాక్టరీలు ఏర్పడ్డాయి. విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీల్లో మున్సిపల్ కార్మికులు, గర్భాంలో ఆయిల్ మిల్లులు, రైస్ మిల్లుల కార్మికులు.. సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు యజమానికి తెలిస్తే ఉద్యోగానికే ముప్పు కనుక అతి రహస్యంగా అష్టకష్టాలు పడ్డారు. ఇదో సుదీర్ఘ చరిత్ర.

1975 ఎమర్జెన్సీ అనంతరం 1977 ఎన్నికల తరువాత పశ్చిమ బెంగాల్లో సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడటం, బెంగాల్‌లోని జ్యూట్‌మిల్లులో సిఐటియు బలంగా ఉండటంతో చిట్టివలస, నెల్లిమర్ల, అరుణ, ఈస్ట్ కోస్టు, ఉమా జ్యూట్ మిల్లుల్లో కార్మికులు సిఐటియులో చేరారు. ఫలితంగా వీటన్నింటిలోనూ నాయకత్వంలోకి వచ్చారు. కార్మిక సమ్మె పోరాటాలు, బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం సహకారంతో మంచి ఒప్పందాలు జరిగాయి. వీటికి ప్రత్యక్ష నాయకత్వం ఎస్.గంగాధర రెడ్డి, దారా బూచి వహించారు. అనంతరం ఈ మిల్లులన్నీ ఐఎఫ్‌టియు నాయకత్వంలోకి వెళ్లడం, అనేక సార్లు అక్రమ లాకౌట్లు జరగడం, ఆ క్రమంలోనే నెల్లిమర్లలో జ్యూట్‌మిల్లు కార్మికులు చేపట్టిన రైలురోకోలో భాగంగా 1994 జనవరి 29న పోలీసు కాల్పుల్లో ఐదుగురు కార్మికులు మరణించారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా విజయనగరం కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

బిహెచ్‌పివి సిఐటియు నాయకుడు జి.సుబ్బారావు చొరవతో స్వామినాయుడు సహకారంతో 1989లో సాలూరు ఫిలడెల్ఫియా ఆసుపత్రిలో సిఐటియు అనుబంధ సంఘం ఏర్పాటు చేయడం, నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్‌ను తొలగించడం, న్యాయస్థానంలో గెలుపొందడం జరిగింది. జీగిరాం జ్యూట్ మిల్లు, సాలూరు మున్సిపల్ వర్కర్స్, సివిల్ సప్లై కళాసీలు, మినీ మోటార్ వర్కర్స్‌లోకి సిఐటియు విస్తరించింది.

1990లో బొబ్బిలి గోపాలకృష్ణ జ్యూట్‌మిల్లులో సిఐటియు అనుబంధ సంఘం పెట్టి అనేక పోరాటాలు చేశారు. జ్యూట్‌మిల్లు 13 నెలల అక్రమ లాకౌట్‌పై వీరోచిత పోరాటం చేసి విజయం సాధించారు. బొబ్బిలిలో హోటల్, ప్రెస్‌వర్కర్స్, బొబ్బిలి, సీతానగరం చక్కెర ఫ్యాక్టరీలకు, మున్సిపల్ వర్కర్స్‌లోకి విస్తరించింది. అనంతరం నవ్య, జ్యోతి జ్యూట్ మిల్లులు, గ్రోత్ సెంటర్‌లో ఫ్యాక్టరీలకు, బొబ్బిలి నుంచి బలిజిపేట రైస్‌మిల్లుల కళాసీలకు సంఘం విస్తరించింది.

పార్వతీపురం రైస్ మిల్లుల కళాసీలు, షాపు ఎంప్లాయిస్, మోటార్ వర్కర్స్‌కు, ఎఫ్‌సిఐ కళాసీల్లోకి, హోటల్, ప్రెస్, మున్సిపల్ వర్కర్స్‌లోకి, సినీ వర్కర్స్, గరుగుబిల్లి రైస్ మిల్స్ కళాసీ సంఘంలోకి, గుమ్మలక్ష్మీపురం లైజాన్ వర్కర్స్, కురుపాం, గుమ్మలక్ష్మీపురం జిసిసి కళాసీలకు సిఐటియు క్రమంగా విస్తరించింది. కార్మికులంతా సిఐటియు గొడుగు కిందకు వచ్చారు. ఇదే కాలంలో కొత్తవలస ప్రాంతంలో ఆంధ్రా ఫెర్రో, పెంకుల మిల్లుల్లో సిఐటియు అనుబంధ సంఘాలు ఏర్పాటై సమరశీల పోరాటాలు చేపట్టడం ద్వారా మంచి అగ్రిమెంట్లు జరిగాయి. పెంకుల మిల్లులో కార్మికులు సమ్మె చేస్తుండగా యజమాని కొత్త కార్మికులతో పని ప్రారంభించారు.దీంతో కార్మికులు ఆ యజమానిని కొడుతూ కిలోమీటర్లు మేర నడిపించి తగిన శాస్తి చేశారు. ఇంకా అనేక సంఘాలకు సిఐటియు విస్తరించి కొత్తవలస ప్రాంతంలో సమరశీల సంఘంగా నిలిచింది.

ఇదే కాలంలో విజయనగరంలో షాపు ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడింది. బొమ్మన, చందన షాపుల్లో సంఘం బలంగా నిలబడి పెద్ద సమ్మె, పోరాటాలు చేసింది. బొమ్మన బ్రదర్స్ బట్టల షాపులో 90 రోజులు సమ్మె చేసి కనీస వేతనం అమలు చేయించింది. చందనలో కూడా కనీస వేతనాలు అమలు చేయించింది. ఇది చారిత్రక విజయమే. స్పాన్ పైపుల కంపెనీకి తరువాత అరుణ, ఈస్ట్ కోస్ట్ జ్యూట్ మిల్లులకు, మున్సిపల్ వర్కర్స్‌లోకి సిఐటియు విస్తరించింది. మున్సిపల్ వర్కర్స్, ముఠా కళాసీలు, జిసిసి ఎంప్లాయిస్‌లోకి, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ, పూసపాటిరేగ వెరా కంపెనీకి, హెచ్‌బిఎల్ కార్మికుల్లోకి విస్తరించింది. వెరా లేబోరేటరీస్‌లో సమ్మె చేసి మంచి ఒప్పందం చేసింది. హెచ్‌బిఎల్‌లో వీరోచిత పోరాటం జరిగింది. అక్కడ నుంచి విజయనగర బయోటెక్‌కూ విస్తరించింది.

1995 తరువాత గరివిడి ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో సిఐటియు అనుబంధ సంఘం పెట్టడం, అక్కడి నుంచి డిఫైన్ మైనింగ్ కంపెనీకి, గర్భాం ఆయిల్, చీపురుపల్లి రైస్ మిల్లులకు విస్తరించింది. ప్రెస్ వర్కర్స్ సంఘం, చీపురుపల్లి వైర్ యూనిట్‌కు విస్తరించింది. గర్భాం ఆయిల్ మిల్లులో సమ్మె, సమరశీల పోరాటం జరిగాయి. ఫేకర్ అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా దాదాపు 6 నెలలు సమరశీల పోరాటాలు చేపట్టింది. ఆ పోరాట ప్రభావంతో స్థానిక ఎన్నికల్లో సిపిఎం తరపున కార్మికులే అభ్యర్థిని నిలబెట్టి గెలిపించారు.

మెడికల్ అండ్ హెల్త్‌లో ఇక్కడ నుండే పోరాటం ప్రారంభించి రాష్ట్ర సంఘం నిర్మాణానికి కృషి చేసింది సిఐటియు. రెండో ఎఎన్‌ఎంల నియామకాల కోసం వీరోచితంగా పోరాడింది. ఫలితంగా జిల్లా ఎన్‌జిఒల్లో బలంగా నిలబడింది. ఆర్‌టిసి, విద్యుత్, అంగన్వాడీ, ఆశా సమస్యలు, మధ్యాహ్న భోజనం కార్మికులు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వేలాది మందితో పోరాటాలు నిర్వహించింది.

1991లో బొబ్బిలిలో సిఐటియు ప్రథమ జిల్లా మహాసభ జరిగింది. రాష్ట్ర కేంద్రం నుంచి శ్రీహరి హాజరయ్యారు. సిఐటియు విస్తరణలో వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ముఖ్యపాత్ర పోషించింది. ఎల్‌ఐసి ఉద్యోగులు సిఐటియు అభివృద్ధిలో వెన్నుదన్నుగా నిలిచారు. నాటి నుంచి నేటివరకు జిల్లాలోని అన్ని రంగాల్లోనూ సిఐటియు కార్మికులతో పెనవేసుకుపోయింది.

ఈ క్రమంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. మరిన్ని సమస్యలు పరిష్కరించుకుని యాజమాన్యాల మెడలు వంచారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో ప్రధానమైన జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటం వల్ల జిల్లా పారిశ్రామికంగా మరింత వెనుకబడింది. ఈస్ట్‌కోస్ట్, అరుణ, బొబ్బిలి గోపాలకృష్ణ, జ్యోతి జ్యూట్ మిల్లులు మరికొన్ని పరిశ్రమల స్థలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. ప్రస్తుతం నడుస్తున్న జ్యూట్ పరిశ్రమలు గానీ, ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు గానీ పూర్తి సామర్థ్యంతో నడవడం లేదు. శాశ్వతంగా మూసివేసిన నాలుగు జ్యూట్‌మిల్లుల్లో 10 వేల మంది కార్మికులకు, ప్రస్తుతం ఉన్న మిల్లుల్లో పూర్తి సామర్థ్యంతో నడవకపోవడం వల్ల 5 వేల మందికి ఉపాధి పోయింది. మొత్తంగా పరిశీలిస్తే పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది కార్మికులు శాశ్వతంగా ఉపాధి దూరమయ్యారు. ఈ ప్రభావం విజయనగరం, గరివిడి, కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పారిశ్రామిక సంక్షోభాన్ని అధిగమించి జిల్లాలో నిలదొక్కుకుంటున్న మైలాన్, హెబిఎల్, సిపి ఆక్వా, ఎస్‌ఎంఎస్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలతో పాటు హేచరీస్, పౌల్ట్రీస్ తదితర పరిశ్రమల్లో కార్మికులు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం, ఈ రంగం కాదు.., అన్ని రంగాల్లోనూ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రెండో ఎఎన్‌ఎం, విఆర్‌ఎలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదు. పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ చేస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వీరందరికీ సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల జరుగుతున్న కష్టనష్టాలను కార్మికవర్గానికి వివరిస్తూ, చైతన్య పరుస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేస్తోంది.

- ఎం.కృష్ణమూర్తి
సిఐటియు పూర్వ సీనియర్ నాయకులు

సాహిత్యం.. జీవితాన్ని ప్రతిబింబించాలి

ప్రజాశక్తి-గాజువాక

జీవితాన్ని ప్రతిబింబించేలా సాహిత్యం రావాలని కథా రచయిత్రి కత్తి పద్మ అభిలాషించారు. శ్రామిక ఉత్సవ్ జరుగుతున్న సాహితీ వేదికపై 'సాహిత్యంలో దళిత, ఆదివాసీ, మహిళ ఆవరణాలు' అనే అంశంపై బుధవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర నైసర్గిక స్వరూపం చాలా గొప్పదన్నారు. సముద్రం, కొండలు, మైదాన ప్రాంతాలు, దళితులు, ఆదివాసీలు నివసించే ప్రాంతమని అన్నారు. విశాఖ నగరంలో అనేక మురికి వాడలు ఉన్నాయని చెప్పారు. ఇందులో మత్స్యకార గ్రామం జాలారిపేట ఉందన్నారు. ఈ జాలారిపేటలో మహిళలకు ఆర్థిక స్వావలంబన ఎక్కువని, ఆర్థిక స్వేచ్ఛ కూడా ఉంటుందని వివరించారు. వీరి వివాహ వ్యవస్థ కూడా చాలా గొప్పదని తెలిపారు. ఇంతవరకు వరకట్న హత్యలు జరగని ప్రాంతంగా చెప్పుకొచ్చారు. దీన్ని సాహిత్య ఆవరణలోకి తీసుకురావల్సి ఉందని అభిప్రాయపడ్డారు. విశాఖలో ఉన్న మురికివాడను తొలగించాలని ప్రభుత్వాలు చేసిన ప్రయత్నానికి అప్పుడు చేసిన తీవ్రమైన పోరాటాలు, ప్రతిఘటనలు కూడా సాహిత్య ఆవరణలోకి ఎంచుకోవాలని కోరారు. అప్పుడే వాస్తవ సాహిత్యం వస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు ప్రయివేటీకరణ వల్ల నష్టపోయిన అంశాలు, కార్మికుల కుటుంబాల్లో మహిళలు, వారి పిల్లలు ఆ పోరాటంపై ఏమనుకుంటున్నారో సాహిత్యం ద్వారా వెలుగులోకి తేవాలని సూచించారు.

సాహిత్య సభలో మాట్లాడుతున్న కథా రచయిత్రి కత్తి పద్మ

కథా రచయిత్రి కత్తి పద్మ

ఉత్తరాంధ్రలో సోంపేట పోరాటం తెగువ చూపించిందని గుర్తుచేశారు. ఆ పోరాటం పాలకులకు బుద్ధి చెప్పిందన్నారు. దాన్ని సాహిత్యంలోకి ప్రతిపాదించాలన్నారు. ఆదివాసీల్లో ఆహార సేకరణ ఎక్కువగా మహిళలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆదివాసీల సంస్కృతి చాలా గొప్పదని, దాన్ని పట్టుకోవాలని కోరారు. ఆదివాసీల్లో అద్భుతమైన జీవన సౌందర్యం దాగి ఉందని వివరించారు. ఈ సమాజంలో ప్రధాన సమస్యలు ఉన్నాయని, వాటిపై చర్చ జరగాల్సి ఉందని చెప్పారు. తక్షణ సమస్యలపై ఏవిధంగా పోరాటం చేస్తామో, అదేవిధంగా సాహిత్యంపైన, కళారంగంపైన, మేధావులు, కవులు కదలాలని పిలుపునిచ్చారు.

కవి కంచరాన భుజంగరావు మాట్లాడుతూ సాహిత్యంలో స్త్రీవాద, దళితవాద, ఆదివాసీ సాహిత్య పాయలు చాలా కొత్త అంశాలను వస్తువులుగా సేకరించాయన్నారు. ప్రొఫెసర్ కెఎస్ చలం మాట్లాడుతూ అస్తిత్వంలో అనే భావనలలో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సంఘటితంగా విముక్తికై కదలాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా భుజంగరావు పూరేడు పిట్ట అనే కవితను వినిపించారు. మతం అనేది మనలో లేదని కవితను పాణిగ్రహి పాడి వినిపించారు. అనంతరం వీరికి సర్టిఫికెట్లు, మెమోంటోలను నిర్వాహకులు అందజేశారు.

న్యాయస్థానంపైనే పూర్తి నమ్మకం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ ప్రాజెక్టు నిర్వాసితులు బొడ్డవర వద్ద చేపట్టిన నిరసన దీక్షలు బుధవారంతో 200వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా, న్యాయస్థానంపై తయకు నమ్మకం ఉందని అన్నారు. 33 మందికి కోర్టు తీర్పు సానుకూలంగా వచ్చినప్పటికీ, పోలీసులు తమను పొలాల్లోకి అనుమతించడం లేదన్నారు. కోర్టు తీర్పు ధిక్కరిస్తున్న అధికారులపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. మిగిలిన బాధితులు కూడా కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. అనంతరం కోర్టు తీర్పు పత్రాలను విలేకర్లకు అందించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు చల్లా జగన్, ఎంపిపి సొండి సోమేశ్వరరావు, పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

రైతుల ఆర్థికాభివృద్ధే పిఎసిఎస్ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

పిఎసిఎస్ పరిధిలో రైతుల ఆర్థికాభివృద్ధే తమ లక్ష్యమని పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పిఎసిఎస్‌లో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 50 టన్నులు యూరియా రైతులకు అందజేశామని, రబీ సీజన్‌లో ఇప్పటి వరకు వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా ధాన్యం కొనుగోలు కొనసాగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు కొనసాగించేలా ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొలిశెట్టి కొండయ్య, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలే కూటమి ప్రభుత్వ మార్క్ పాలన : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు గడుస్తున్నా సామాన్యులపై భారం మోపడం తప్ప సాధించిన పురోభివృద్ధి ఏమీ లేదని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరల భారంతో సామాన్యుడి నడ్డివిరిపు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 50ఏళ్లు దాటిని ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇస్తామని ఎన్నికల ముందు ఆశ చూపి నేటికీ ఒక్కరికీ కొత్త పెన్షన్ ఇవ్వలేదని విమర్శించారు. అలాగే 20లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసిన టిడిపి నాయకులు ఇప్పుడు కేవలం 20 నెలల్లోనే రూ.2లక్షల 92వేల కోట్లు అప్పు తీసుకొచ్చారని తెలిపారు. అభివృద్ధి పేరుతో సామాన్యుడికి ఒరిగిందేమీ లేదని, ప్రతి వర్గంలో ఈ ప్రభుత్వంతో ఇబ్బందులు పడుతోందని విమర్శించారు.

విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వికసిత్ భారత్ బిల్డ్ థాన్ జాతీయ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సృజనాత్మక ప్రాజెక్టులతో జాతీయ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 9వ తరగతి విద్యార్థినులు జ్యోతి, శ్వేత, లిఖితలు కరెంట్ అవసరం లేని ఎకో ఫ్రెండ్లీ ఫ్రిజ్ రూపొందించగా, జస్వంత్, పవన్, భూపాల్‌లు చెరువుల్లోని ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు ప్రాజెక్టును ఆన్‌లైన్‌లో సమర్పించారు. గైడ్ టీచర్‌గా అదపాక దామోదరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రసంశ పత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి- రామభద్రపురం

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బాడంగి ఫైర్ ఆఫీసర్ రామసూర్యారావు సూచించారు. మండలంలోని ఆరికతోటలో బుధవారం బాలాజీ మోడ్రన్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉండటంతో అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. కార్బన్‌డయాక్సైడ్ సిలెండర్లు, డ్రైకెమికల్ పౌడర్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందివ్వాలన్నారు. జాతీయ రహదారి పక్కన నిల్వ చేస్తున్న ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఫైర్ ఆఫీస్ సిబ్బంది, మిల్లు గుమస్తా మామిడి శివయ్య పాల్గొన్నారు.

వివరాలను అధికారికి వివరిస్తున్న మిల్లు యజమాని

వెంకన్న ఆదాయం రూ.9.45 లక్షలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. కానుకల రూపంలో రూ.9,22,210, కోదండ రామాలయం హుండీ నుంచి రూ.23,229 నగదు వచ్చిందని ఆలయ ఇఒ బి.శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబర్ 15నుంచి డిసెంబర్ 31 వరకు వచ్చిన కానుకలను లెక్కించినట్టు తెలిపారు.

హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

అధునాతన కాస్మోటిక్ చికిత్సను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి కంటోన్మెంట్

మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో వస్తున్న అధునాతన మార్పులను, కాస్మోటిక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. నగరంలోని ఆర్ అండ్ బి జంక్షన్ దగ్గర గల అమూల్య స్కిన్ కేర్ క్లినిక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ లేజర్, ఎంఆర్‌ఎఫ్ మిషిన్స్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేటి కాలంలో చర్మ సంరక్షణ అనేది కేవలం అందానికి మాత్రమే పరిమితం కాదని, అది ఆత్మవిశ్వాసానికి చిహ్నమని అన్నారు. అమూల్య స్కిన్ కేర్ వంటి సంస్థలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన 'మైక్రో నీడ్లింగ్ ఆర్‌ఎఫ్, ఆర్‌ఎఫ్ మ్యాట్రిక్స్' వంటి సేవలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. అమూల్య స్కిన్ కేర్ క్లినిక్ ఎమ్‌డి డాక్టర్ చండీ ప్రియ మాట్లాడుతూ.. తమ క్లినిక్‌లో మొటిమల మచ్చలు, గాయాల గుర్తులు, స్ట్రెచ్ మార్క్స్ తొలగింపునకు ప్రత్యేక చికిత్సలు ఉన్నాయని తెలిపారు. ముఖ సౌందర్యం కోసం ఫేషియల్ కాంటౌరింగ్, స్కిన్ లిఫ్టింగ్, టాటూ రిమూవల్ వంటి సేవలతో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా 'వజైనల్ రిజువనేషన్' వంటి అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. దిగువ, మద్యతరగతి కుటుంబాలకు అందుబాటు లోనే ఇక్కడ చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మాజీ ఎంఎల్సి రఘువర్మ, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రామ్‌ప్రసాద్, ఐఎంఎ ప్రతినిధులు డాక్టర్ జేసీ నాయుడు, విఎస్ ప్రసాద్, అశోక్, ఎల్ శ్రీనివాస్, ఎస్.రామ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మిషిన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

378 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 378మంది విద్యార్థులకు ఆప్తాలమిస్టులు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పర్యవేక్షించారు. విద్యార్థులు తప్పనిసరిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన విద్యార్థులకు కళ్లజోడు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష పరిశోధనపై అవగాహన

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులకు భూసార పరీక్ష, పరిశోధనా సాహిత్య ఉపయోగాత్మకపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎఎంసి ఎస్‌టిఎల్ వ్యవసాయ అధికారి ఎ.లలిత అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం భూసార పరీక్షా ప్రయోగశాల వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌హెచ్‌సి యాప్, భూసార పరీక్షల ప్రాముఖ్యత, మట్టి నమూనా తీసుకొనే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల నేల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు విద్యార్థులకు భూసార పరీక్షలు, దాని ఉపయోగాలపై అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులచే నిర్వహిస్తున్న బడితోటలో కూరగాయల సాగును పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు, వ్యవసాయశాఖ ఎఇఒలు శ్రావణ్ కుమార్, సూర్య నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న లలిత

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - బలిజిపేట

ఎంపిపి జి.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ శ్రీవాణి ఆధ్వర్యాన ఈ సమావేశం జరిగింది. తొలుత తహశీల్దార్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామాల్లో భూరీసర్వే జరిగిందని, వారికి పట్టాదారు పాసుపుస్తకాలు త్వరలో అందజేస్తామని తెలిపారు. రికార్డుల్లో ఉన్న వారికే రీసర్వే చేయబడిందని, ఎటువంటి ఆధారం లేకుండా రీసర్వే చేస్తామని తెలిపారు. వ్యవసాయాధికారి శివ గణేష్ మాట్లాడుతూ మండలంలోని 50శాతం ధాన్యం కొనుగోలు జరిగిందని, మిగిలిన ధాన్యం త్వరలో కొనుగోలు చేస్తామని తెలిపారు. యూరియా కొరత లేకుండా పంపిణీ చేశామని, డ్రోన్ ద్వారా రబీ పంటకు స్ప్రే చేస్తామని తెలిపారు. ఇందుకు ఎకరాకు రూ.400 వరకు ఖర్చవుతుందని, రైతులు దీన్ని ఉపయోగిం చుకోవాలని తెలిపారు. నారాయణపురంలో గ్రామస్తులకు గౌరీపురం గ్రామ రెవెన్యూలో భూములున్నందున వారికి ఎరువులు ఇప్పించాల్సిందిగా ఎంపిటిసి సభ్యులు రాజమోహన్ కోరారు. ఇరిగేషన్ ఎఇ మాట్లాడుతూ చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, చెరువుల్లో నీరు తగ్గిన తర్వాత పనులు చేపడతామని తెలిపారు. ఎంపిటిసి సభ్యులు కేశవరావు మాట్లాడుతూ మండలంలోని 600 గోశాలలకు దరఖాస్తులు చేయగా, ఇంకా ఒక్కరికీ ఎందుకు మంజూరు చేయలేదని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్ కోసం సర్పంచులు అడగ్గా, ఇంటింటి కుళాయి పైపులు గురించి, సిసి రోడ్లను ఇరువైపులా పడగొట్టినందు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపిపి వి.సాయిరాం, జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు

అధికారులను నిలదీస్తున్న సభ్యుడు

పోలీసు సిబ్బంది సేవలు అభినందనీయం

ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పి దామోదర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘంగా సేవలందించి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబులుకు ఆశాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగాజరిగిన అభినందన సభలో ఎస్పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తరువాత ఎంచుకున్న మార్గాల్లో విజయం సాధించాలని, కుటుంబం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసుశాఖలో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఎఎస్ఐ తిరుమలరాజు సూర్యనారాయణ రాజు, హెడ్ కానిస్టేబులు మిత్తిరెడ్డివెంకట రామ సింహాచలం (రామ)లను జిల్లా పోలీసుశాఖ తరుపున ఎస్పి ఎఆర్ దామోదర్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఎస్పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు విధులను ఎంతో సమర్ధవంతంగా నిర్వహించడం చాలా కష్టతరమని, అటువంటి విధులను సమర్ధవంతంగా నిర్వహించి, పోలీసుశాఖకు సుదీర్ఘకాలంగా సేవలందిం చడం అభినందనీయమన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ వ్యవహారాలపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం, సూర్యనాయణ రాజు, రామాతో ఎస్పి మాట్లాడి, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, డిఎస్పి ఆర్.గోవిందరావు, ఎస్బి సిఐలు ఎవి లీలారావు, ఎస్.విద్యాసాగర్, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఆర్ఐ ఎన్. గోపాల నాయుడు, కో-ఆపరేటివ్ సభ్యులు నాయుడు, పోలీసు అసోసియేషను అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, పెద్దఎత్తున ఉపాధ్యాయులు, డిఇఒ మాణిక్యంనాయుడు పాల్గొని, ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్‌సి రామాను సత్కరిస్తున్న ఎస్‌పి దామోదర్‌రెడ్డి, ఎఎస్‌పి సౌమ్యలత

రామాకు అభినందన ర్యాలీ

హెచ్‌సి వెంకటరామ సింహాచలం ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన అభిమానులు నగరంలో భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. జిల్లాపోలీసు కార్యాలయం నుంచి పోర్టుసిటీ స్కూలు వరకు ఓపెన్ టాప్ జీపులో ఆయనను ఊరేగించారు. అనంతరం అక్కడ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

యుటిఎఫ్ డైరీ, కేలెండర్‌ను, పదో తరగతి మోడల్‌పేపర్లను డిఇఒ యు.మాణిక్యంనాయుడు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, జిల్లా కోశాధికారి తిరుపతినాయుడు, సీనియర్ నాయకులు డి.రాము, జె.రమేష్‌చంద్ర పట్నాయిక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

బాడీ బిల్డింగ్ పోటీలు విజేతలకు అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 28న చెన్నై నగరంలో ఘనంగా నిర్వహించిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌లో విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం తన నివాసంలో విజయం సాధించిన క్రీడాకారులను అభినందించారు. 80 కేజీల కేటగిరీలో అద్భుతమైన ప్రదర్శనతో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయిలో తన సత్తా చాటిన విజయనగరం చెందిన ఎస్.కె. సుభాన్, జి.రమేష్ 55 కేజీల కేటగిరీలో నాలుగవ స్థానం, జూనియర్ విభాగంలో ఆరవ స్థానం సాధించి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయనగరం పేరు మార్మోగేలా కృషి చేసిన క్రీడాకారుల పట్టుదల, శ్రమ ప్రశంసనీయమని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కనకల కృష్ణ, సెక్రటరీ బైక్ రమేష్ కూడా విజేతలను అభినందిస్తూ, జిల్లా నుంచి ఇలాంటి ప్రతిభావంతులు ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. క్రీడాకారులకు అసోసియేషన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

పారా స్పోర్ట్స్ చరిత్రలో 2025 మైలురాయి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025వ సంవత్సరం పారా స్పోర్ట్స్ చరిత్రలో ఓ చరిత్రాత్మక మైలురాయి గా నిలిచిపోనుందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అన్నారు. ఈ ఏడాదిలో జరిగిన అన్ని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు గతంలో ఎప్పుడూ లేని విధంగా అత్యధిక పతకాలు గెలుచుకున్నారని అన్నారు. కేవలం పతకాలు మాత్రమే కాకుండా జీవో నెంబర్ 4 ద్వారా సాధించిన ప్రభుత్వ ఉద్యోగాలతో జీవితాలు కూడా మారాయని అన్నారు. ఇదే స్ఫూర్తితో 2026లో అడుగుపెడుతున్న వేళ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ఇంతగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి లకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామసభల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభల ద్వారా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అధికారులు ముందుగా నిర్దేశించిన గ్రామాల్లో జనవరి 2నుంచి 9వ తేదీ వరకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అధికారులు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న లెక్కల మామయ్యతో ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల నాలుగో తేదీన విజయనగరం గురజాడ పాఠశాలలో హైదరాబాద్‌లో ప్రసిద్ధి చెందిన లెక్కల ఉపాధ్యాయుడు చంద్రయ్య అలియాస్ లెక్కల మామయ్యతో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులకు మ్యాథమెటిక్స్‌పై ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో ఆవిష్కరించారు. లెక్కల మామయ్యగా ప్రసిద్ధి చెందిన చంద్రయ్య అంకెల గారడీతో లెక్కలను సులభ పద్ధతులు విద్యార్థులకు ఏ విధంగా బోధించాలో శిక్షణనిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి విజయనగరం జిల్లాలకు చెందిన ప్రభుత్వ,ప్రైవేట్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ తరగతులు 4వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, జిల్లా నాయకులు అల్లూరి శివవర్మ, సాంస్కృతిక విభాగం కన్వీనర్ డప్పు శ్రీను, జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, జిల్లా ప్రతినిధులు పి.షణ్ముఖరావు, శీరాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జనసేన కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన పార్టీ సిద్ధాంతాలను చాటిచెబుతూ రూపొందించిన 2026 సంవత్సరానికి సంబంధించిన కేలెండర్‌ను ఆ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన దంపతులు బుధవారం బాలాజి నగర్‌లోని జనసేన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అటవీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఆ శాఖలకు దేశవ్యాప్త గుర్తింపును తీసుకువచ్చారని అన్నారు. అవనాపు భావన మాట్లాడుతూ 2026లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయనగరం మండల, పట్టణ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు అవనాపు విక్రమ్ తదితరులు

చెల్లూరులో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు చెల్లూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారంను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లిపిల్లి ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఇ.సత్తిబాబు, ఉప సర్పంచ్ వరలక్ష్మి, విద్యుత్తుశాఖ ఎఇ సంతోష్, లైన్ మెన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీం దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పౌరసరఫరాల శాఖ లో ఆఫీస్ సబార్డినెట్ గా పని చేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన షేక్ ఇబ్రహీం కు జిల్లా రెవిన్యూ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మురళి , రెవిన్యూ అసోసియేషన్ తరపున అధ్యక్షులు తాడ్డి గోవింద్, జిల్లా సెక్రెటరీ సూర్య , ఇతర రెవిన్యూ సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. ఇబ్రహీం జిల్లాలో పనిచేసిన పలువురు కలెక్టర్ల వద్ద దఫెదార్‌గా పని చేసి అందరి మన్ననలు పొందారని అధికారులు కొనియాడారు.

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కస్పా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణపై వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.విశాలాక్షి, ఉపాధ్యాయులు, మున్సిపల్ ఆఫీస్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో స్వర్ణాంధ్ర సాకారం : మంత్రి

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, 'సూపర్ సిక్స్' హామీలు విజయవంతంగా అమలవుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. పట్టణంలోని 24, 26, 27వ వార్డుల్లో బుధవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వయంగా పాల్గొని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలతో కలిసి పాల్గొన్న మంత్రి, రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 2025 ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు. గిరిజన శాఖలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను పూర్తి చేసి, పర్మినెంట్ స్థిరీకరణ చేపట్టామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యార్థుల వసతి గృహాల కోసం నిధులు కేటాయించినట్లు చెప్పారు. సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.200 కోట్లు వెచ్చిస్తున్నామని ప్రకటించారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతూనే, కాఫీ తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అంటిపేటలో వృద్ధులు, వికలాంగులకు, నిరాశ్రయులకు జిల్లా కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1,39,291మంది అభయహస్తం, వృద్ధులు, వికలాంగులకు, నిరాశ్రయులకు, చేనేత, కళాకారుల, మత్స్య కారులు అర్హులైన తదితరుల ప్రతి ఇంటికి వెళ్లి రూ.60,026,300 పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని సవరకోటపాడులో బుధవారం మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో పేదల సేవలో ఎన్టీఆర్ పెన్షన్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. ప్రతి ఒక్క పెన్షన్ లబ్ధిదారులు భద్రత, భరోసా, చిరునవ్వులతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టేలా కూటమి ప్రభుత్వం ముందస్తుగా పెన్షన్ పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి బిడ్డిక పద్మావతి, తోటపల్లి దేవస్థానం సభ్యులు ఆరిక జానకి, అరకు పార్లమెంట్ కార్యదర్శి తాడంగి రామారావు, మాజీ కన్వీనర్

లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పింఛను అందజేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పాడి సుదర్శనరావు, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ, నాయకులు తోయక దామోదరరావు, సోనైల రామారావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: మండలంలోని వీరభద్రపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు కొండంత భరోసానిస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని మాతుమూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాంచాలిలో మండల టిడిపి గూడెపు యుగంధర్, పాచిపెంటలో ఎఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, కొత్తవలసలో పిఎసిఎస్ అధ్యక్షులు మాదిరెడ్డి మజ్జారావు, మతల బలరాం, మిర్తివలసలో సర్పంచ్ కొత్తల సత్యవతి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు

ఖైదీల సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సౌమ్య జాస్పిన్

ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి సౌమ్య జాస్పిన్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఖైదీల సంక్షేమం, భద్రతా, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఖైదీల సత్రృవర్తతోనే శిక్షా కాలం తగ్గుతుందని అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ అన్నారు. బుధవారం ఆమె స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని వాతావరణం పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించారు. ఖైదీలను వ్యక్తిగతంగా కలుసుకుని వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార నాణ్యత, తాగునీటి సరఫరా, వైద్య సేవలు, పరిశుభ్రత, శానిటేషను సదుపాయాలపై ఆరా తీశారు. మానసిక ఆత్మవిశ్వాసం పెంచేలా కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని జైలు అధికారులను జడ్జి ఆదేశించారు. ఖైదీల పునరావాస విషయంపై ఆమె చర్చించి, జైలు నుంచి విడుదలయ్యాక సమాజంలో తిరిగి స్థిరపడేలా వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాలన్నారు. జైలులో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల నిర్వహణ, జైలు డైరీలు, మెడికల్ రిజిస్టర్లు, స్టాక్ బుక్స్‌ను పరిశీలించారు. ఖైదీలకు సంబంధించిన కేసుల పురోగతిపై మేజిస్ట్రేట్ సబ్ జైలు అధికారులతో చర్చించారు. జడ్జి అధికారు లతో మాట్లాడుతూ ఖైదీల హక్కులు, మానవీయ విలువలను కాపాడేలా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సదుపాయాలు నిరంతరం మెరుగుపరచాలని సూచించారు. జైలు వాతావరణం పరిశుభ్రంగా, ఖైదీలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఉండేలా జైలు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మేజిస్ట్రేట్ తెలిపారు. ఈ పర్యటనలో జైలు విజిటింగ్ అడ్వకేట్ టి. జోగారావు, మీడియేషన్ అడ్వకేట్ ఎం.వి.రమణ, సబ్ జైలు పర్యవేక్షణాధికారి జి. రాము తదితరులు పాల్గొన్నారు.

విఎఎకు సన్మానం

పాలకొండ : మండలంలోని వెలగవాడ స్వర్ణ సచివాలయం పరిధిలోగల పిఆర్‌రాజు పేట, వెలగవాడ, సింగన్నవలస గ్రామాల్లో నూటికి నూరు శాతం ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. వెలగవాడ, సింగన్న వలస కు సంబంధించి 70శాతానికి పైగా కొనుగోలు జరిగింది. గతంలో ఇదే సమయానికి 50 శాతం మాత్రమే కొనుగోలు జరిగింది. రికార్డు స్థాయిలో కొనుగోలు చేయడానికి సహకరించిన వ్యవసాయ గ్రామ అసిస్టెంట్ పి.పవిత్ర, టెక్నికల్ అసిస్టెంట్ పద్మ సహకరించినందుకు బుధవారం వారిని సన్మానించారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు అందడం, ఎన్ని ఆటంకాలు ఎదురైనా లక్ష్యం సాధించి రైతులకు సంక్రాంతికి సకాలంలో నగదు అందించడం దృష్ట్యా అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు పవిత్రను, పద్మను సన్మానించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్త అల్లు కోటేశ్వరరావు, వెలగవాడ స్వర్ణ సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కె.దిలీప్‌కుమార్, విఆర్ఒ కె.రామచంద్రరావు, డిజిటల్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ ప్రతాప్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ మృతి చెందడంతో బుధవారం గాయత్రి కల్యాణ మండపంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతాప్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతాప్ వంటి వ్యక్తి ఉండరని కొనియాడారు. రాజకీయాల్లో ఎదురులేని వ్యక్తిగా పేరుపొందారున్నారుఃస. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు ఎస్.పరీక్షిత్‌రాజు, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, చైర్ పర్సన్ ప్రతినిధి ఆకుల కుమార్, కమిషనర్ రత్నం రాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, తదితరులు నివాళులర్పించారు.

సిపిఐ సీనియర్ నేత కన్నుమూత

ప్రజాశక్తి - సీతంపేట

సిపిఐ సీనియర్ నాయకులు, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కూరంగి మొఖలింగం (80) అనారోగ్యంతో ఆయన తన స్వగ్రామమైన మండలంలోని గాడిదపాయిలో బుధవారం కన్నుమూశారు. మొఖలింగం పార్థివ దేహానికి మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్, బి.అప్పలనాయుడు పూలమాల వేసి ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. కూరంగి చక్రపాణి, కురుపాం మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, సిపిఐ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సభ్యులు లండ వెంకట్రావు, పార్వతీపురం మన్యం జిల్లా యువజన సంఘం కార్యదర్శి కూరంగి గోపి నాయుడు, సీతంపేట మండల కార్యదర్శి కూరంగి జగదీష్, జిల్లా సమితి సభ్యులు బిడ్డిక బంగారు పార్టీ వివిధ శాఖల కార్యదర్శులు మొఖలింగం పార్దేవ దేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాటు సారా కేంద్రాలపై ఎక్సైజ్‌శాఖ దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దు గ్రామాల్లో నాటు సారా తయారీపై కట్టడి చర్యల్లో భాగంగా బుధవారం దాడులు జరిపినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. శ్రీనాథుడు ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారి బి.జీవన్‌కిషోర్ ఆధ్వర్యంలో కెరడ, వలవ గ్రామాల్లో దాడులు నిర్వహించి 5,400 లీటర్ల పులిసిన బెల్లపు ఊట, 180 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నమని తెలిపారు. నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలపై సమాచారం ఉన్నవారు 6302936599 నెంబరుకు ఫిర్యాదు చేయాలని, సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజేశ్వరి, కురుపాం ఎస్ఐ జె.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా వైద్యులు, విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఒ గుడివాడ ప్రభాకరరావు గుమ్మలక్ష్మీపురం వారపు సంతలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గిరిజనులు, బలహీన వర్గాలు, వృద్ధులకు, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య శిబిరం ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. డాక్టర్ ప్రభాకర్ ప్రాణదాత అని గిరిజన ప్రాంతానికి ఆయన సేవలు ఎనలేనివని ఆమె కొనియాడారు. వారు ఎంతోమంది రోగులకు చికిత్స చేయడమే కాకుండా ఉచితంగా మందులు అందజేసిన విషయం అందరికీ తెలిసిందేనని అటువంటి ప్రజా వైద్యుల సేవలను అందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు మాట్లాడుతూ డాక్టర్ ప్రభాకర్‌రావు గురించి ఈ ప్రాంతంలో తెలియనివారు ఎవరూ లేరని, ఆయన రిటైర్ అయినప్పటికీ నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఎఎంసి చైర్మన్ కళావతి, మండల టిడిపి కన్వీనర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

విద్యార్థులకు ఎమ్మెల్యే విజయచంద్ర అభినందనలు

ప్రజాశకిత -పార్వతీపురం

ఎన్‌సిఇఆర్‌టి నిర్వహించే ప్రతిష్టాత్మక రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన-2025 (జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్)కు అర్హత సాధించిన నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దొడ్డి రిషేంద్ర నాయుడు, ఎస్.గుణవర్ధన్‌ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అభినందించారు. బెంగళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫెస్ట్‌లో నర్సిపురం విద్యార్థిల వినూత్న ప్రాజెక్ట్ గ్రామ ముస్తాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయస్థాయిలో సత్తా చాటి మన్యం జిల్లాకు కీర్తి ప్రతిష్టలు సాధించిన విద్యార్థులు, బుధవారం ఎమ్మెల్యే విజయ చంద్రను కలిశారు. వీరిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించిన శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని విజయాలు సాధించి అటు తల్లిదండ్రులకు, ఇటు పాఠశాలకు మరింత పేరు తేవాలని సూచించారు. ఎలాంటి అవసరం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కొమరాడ

కార్యకర్తలకు, నాయకులకు వైసిపి ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని కొరిశిలకు చెందిన వైసిపి అభిమాని చింతాడ నూకరాజు కుటుంబ సభ్యులను బుధవారం ఆమె పరామర్శించారు. నూకరాజు అకాలమరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూకరాజు పార్టీ కార్యకర్తగా, వీరాభిమానిగా ఉన్న నూకరాజు ఇలా అకాల మృతి చెందడం దురదృష్టకరమన్నారు. అతని కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

సబ్‌జైలులో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జిల్లాజడ్జి బబిత

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసినారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని అన్నారు. ఖైదీల పట్ల విపక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. ఖైదీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని అన్నారు. సకాలంలో న్యాయ సహాయం అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలిపారు. తనిఖీలో నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి అప్పల స్వామి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, సబ్‌జైలు సూపరింటెండెంట్ కెవిఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రబీకి సరిపడా యూరియా అందుబాటులో ఉంది : జెడి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రబీ సీజన్‌కు గాను జిల్లాకు సరిపడా యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు తెలిపారు. 1.10.2025 నుండి 31.12.2025 వరకు జిల్లాకు మొత్తం 10,853 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా అంచనా వేయగా, ఇప్పటివరకు సరిపడా నిల్వలు సమకూర్చామని తెలిపారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ సక్రమంగా జరుగుతున్నదని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి అనుగుణంగా యూరియా సరఫరా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎరువులను అవసరానికి మించి నిల్వ చేసుకోకుండా, వ్యవసాయ శాఖ సూచనల మేరకు మాత్రమే వినియోగించాలని రైతులను ఆయన కోరారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-గంట్యాడ

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బోనంగి గ్రామంలో బుధవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. పిఎంఇజిపి స్కీం కింద 22 మంది లబ్ధిదారులకు రూ.1.07కోట్ల రూపాయల విలువైన ఆస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలలో పేదలను ఆదుకుందని అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలను చైతన్యవంతులు చేయడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.5వేలు నుంచి రూ.10వేలకు, ఎక్కడికీ కదలలేని

గ్రామసభలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

మంచం మీద పడి ఉన్నవారికి రూ.15వేలకు పెంచామన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి కంపెనీలను తీసుకురావడనికి ప్రయత్నం చేస్తుందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం గత ఏడాది రూ.70 లక్షలు నిధులను మంజూరు చేశామన్నారు. బోనంగి జనక్షన్ నుండి మదనాపురం జంక్షన్ కు రోడ్డు నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేశామన్నారు. పిఎంఇజిపి ద్వారా 22 ఆటోలకు రూ.66లక్షలు నిధులు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపిడిఓ ఆర్‌వి రమణమూర్తి, గజపతి నగరం ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, గంట్యాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, చినరామనాయుడు, వెలమ సంఘం రాష్ట్ర నాయకులు అళ్ల విజ్జు కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు గోపిశెట్టి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యత

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిశుభ్రత, సుందరీకరణకు అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరును గమనించారు. రహదారులపై ఎక్కడైనా చెత్తాచెదారాలు గమనిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ దుకాణాల వద్దకు వెళ్లి సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. టిఫిన్ దుకాణాలు, పళ్ళ వ్యాపారాలు, కూరగాయలు విక్రేతలు ఏ ఒక్కరు కూడా క్యారీ బ్యాగులు గాని, ముచ్చులు, ప్లాస్టిక్ తో తయారైన సంచులు వంటివి వినియోగించరాదని చెప్పారు. టిఫిన్ దుకాణాలలో ఆకులలో మాత్రమే ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్ ను సందర్శించారు. అక్కడ ఉన్న నీటి శుద్ధి ప్లాంటును తనిఖీ చేశారు.

పేదలకు ఆసరా

పేద వర్గాల ప్రజలకు ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ఆర్థిక ఆసరాగా నిలుస్తుందని కమిషనర్ పల్లి నల్లనయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం కణపాకలోని లబ్ధిదారులకు అందజేస్తున్న పింఛను పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగం వ్యాప్తంగా 22,640 మందికి 9కోట్ల 93లక్షల 14,500 రూపాయల పింఛను అందిస్తున్నామన్నారు. ఈనెల కొత్తగా 38మంది లబ్ధిదారులకు రూ.1,64,000 అందిస్తున్నా మన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

తెల్లవారు జామున సబ్ కలెక్టర్ ఇసుక రీచ్‌ల తనిఖీ

ప్రజాశక్తి కొమరాడ

ఇసుక, కంకర అక్రమ రవాణాపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి ఇసుక రీచులను బుధవారం వేకువజామున చీకటితోనే ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ముందుగా కూనేరు రామభద్రపురం ఇసుక రీచ్‌ను, ఆ తర్వాత కొమరాడ, గుమ్మడ, కల్లికోట ఇసుక రీచ్‌లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొమరాడ, గుమ్మడ రీచ్‌లకు ఇసుక కోసం వెళ్తున్న ట్రాక్టర్లను ఆరా తీసి వివరాలు అడిగి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అనధికారంగా ఇసుకరీచులు నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఈ మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం జెసిబి, ఇతర పెద్ద వాహనాలతో ఇసుకను తరలించేందుకు ఎటువంటి అనుమతుల్లేవని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ తరలింపుపై ప్రభుత్వం అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. మండలంలో ఇసుక అకమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినట్టు తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక తహశీల్దార్ సిహెచ్. సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. సబ్ కలెక్టర్ వేకువ జామునే చీకట్లోనే ఇసుక రీచులను తనిఖీలు చేయడంతో ఇసుక

ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

అక్రమార్కులు ఒకసారిగా ఉలిక్కిపడ్డారు.

పాలకొండ :మండలంలో నాగావళి నది నుంచి ఇసుక, కొండల నుంచి కంకర తవ్వుకుంటూ పోతున్నారు. దీంతో సహజ సంపద తరిగిపోతుంది. అయితే అధికారులు దీనిపై కొరడా జులిపిస్తున్నారు. బుధవారం వేకువ జామున 4:30 గంటల సమయంలో అధికారులు మెరుపు దాడులు చేపట్టారు. అట్టలకొండ నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు లారీల కంకరను తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, సిఐ ఎ.ప్రసాదరావు పట్టుకున్నారు. అదేవిధంగా గోపాలపురం, అంపిలి గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో సబ్ కలెక్టర్ స్వప్నల్ పవర్, సిఐ వేకువ జామున 5గంటల సమయంలో పరిశీలన చేశారు. అయితే అక్కడ నాటు బండ్లు ఉండడంతో వారితో మాట్లాడారు. ట్రాక్టర్లతో ఇసుక ఎవరైనా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రకృతిని కాపాడితే భావితరాల్ని రక్షిస్తుంది: జడ్జి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ప్రస్తుత కాలంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిపౌరుని బాధ్యతగా మారిందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి శాఖ సహకారంతో పూసపాటిరేగ మండలం కందివలసలో బుధవారం హైదరాబాద్ బ్యాటరీస్ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పాల్గొన్న కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వృక్ష సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, నీటి వనరుల పరిరక్షణ, స్వచ్ఛత వంటి అంశాలు భవిష్యత్ తరాలకు ఎంతో కీలకమని అన్నారు. పర్యావరణ సమతుల్యత కాపాడితేనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

ప్రజాశక్తి - గుర్ల

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పదంలో నడిపిస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. బుధవారం కొండగండ్రేడు గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ డ్రైనేజీను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గడిగడ్డ మత్స్యకార సంఘాల సభ్యులకు ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గాడి తప్పిన పరిపాలనను గాడిలో పెడుతున్నామని దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా మన రాష్ట్రంలో రూ.4వేలు పింఛను అందజేస్తున్నామని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు తెలపడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి సకాలంలో సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఒకు ఆదేశించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఊరు పైన తోటపల్లి కాలువ ఊరు దిగువ నుంచి ఉత్తరాంధ్ర సృజల స్రవంతి పథకం రావడంతో భూములు పూర్తిస్థాయిలో కోల్పోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, జనసేన నాయకులు విజినిగిరి శ్రీనివాసరావు, తెట్టంగి పిఎసిఎస్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రాజు, గూడెం సొసైటీ అధ్యక్షులు పిల్లా అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మహేష్, నియోజకవర్గం ఎఎంసి ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, గ్రామ పెద్దలు మునకాల ఆదినారాయణ, అంబల్ల రమణ, బోడసింగి పైడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న ఎంపి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కళా వెంకటరావు